# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :20 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 16-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## సునీతా విలియమ్స్‌కు లైన్ క్లీచర్..రోదసీలోకి దూసుకెళ్లిన ఫాల్కన్

వాషింగ్టన్,మార్చి15: మూడోసారి రోదసీలోకి వెళ్లి అంతరిక్షకేంద్రంలోనే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలోనే భూమ్మీద కాలుమోపే దిశగా అడుగులు పడ్డాయి. నాసా-స్పేస్ ఎక్స్‌లు తాజాగా క్రూ-10 మిషన్‌ను చేపట్టాయి. నలుగురు వ్యోమగాములతో కూడిన ఫాల్కన్ 9 రాకెట్ భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 4.33 గంటలకు కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి నింగిలోకి తీసుకెళ్లింది. దాదాపు తొమ్మిది నెలలుగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌అంతరిక్ష కేంద్రం లోనే ఉంటున్న విషయం తెలిసిందే. వారిని భూమిపైకి తీసుకొచ్చేందుకు మూడు రోజుల క్రితం క్రూ-10 మిషన్ ను చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే చివరి నిమిషంలో సాంకేతిక కారణాలతో ఆ ప్రయోగాన్ని నిలిపేశారు. తాజాగా వారిని తీసుకొచ్చేందుకు మళ్లీ ప్రయోగం చేపట్టారు. డ్రాగన్ క్యాప్సుల్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన వారిలో అన్నె మె÷-లకెయిన్, నికోల్ అయర్స్, టకుయా ఒనిషి, కిరిల్ పెస్కోవ్ వ్యోమగాములు ఉన్నారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో ఐఎస్ఎస్‌కు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు చేరుకున్నారు.

## కాంగ్రెస్,బీజేపీ ఎమ్మెల్సీలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారు..



హైదరాబాద్,శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. జయజయహే తెలంగాణాకు ఆంధ్ర వ్యక్తి ఎం.ఎం కీరవాణి సంగీతం ఇవ్వడం పట్ల సోషల్ మీడియాలో అభ్యంతరం వ్యక్తం అవుతుందని తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ తల్లికి దండ వేయని వ్యక్తి తెలంగాణ తల్లి విగ్రహ రూపం రూపొందించారని దుయ్యబట్టారు. తెలంగాణ విగ్రహ రూపం మార్చడం సరైంది కాదని అన్నారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ, బోనాలు ఆ రెండూ లేకుండా విగ్రహం రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. 2.64 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది అంటే అందులో కాళేశ్వరం పాత్ర కూడా ఉందని వెల్లడించారు. మేడిగడ్డను బూచిగా చూపించారు.. ఇవాళ పంటలు ఎండిపోతున్నాయి. పంటలను గొర్రెలు, పశువులు మేస్తున్నాయని కవిత పేర్కొన్నారు. సూటు బూటు వేసుకుని ఉద్యోగం చేయడమే కాదు.. గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుని ఉపాధి పొందడం కూడా ఉపాధేనని తెలిపారు.బోనస్ బోగస్‌గా మారిపోయింది.. మహాలక్ష్మిని పాక్షికంగా మాత్రమే అమలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. మహిళలకు 2,500లు తక్షణమే చెల్లించాలి.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూది లేదు. దూది లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ రిపోర్ట్ పూర్తిగా టేబుల్ చేయాలి.. పరిశ్రమలు రాష్ట్రం వదిలిపోతున్నట్లు ప్రచారం జరుగుతుంది.. గతంలో ఉన్న పరిశ్రమలు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. హైడ్రాతో నిరంతరం విధ్వంసం చేస్తున్నారని అన్నారు.మండలిలో కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్సీలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారు.. దీని గుర్తించి తమ ఎమ్మెల్సీలు అడ్డుకునే ప్రయత్నం చేస్తే చైర్మన్ న్యూసెన్స్ చేయవద్దని కామెంట్ చేశారు. మండలి చైర్మన్‌గా న్యూసెన్స్ అనే పదం వాడారు.. దాన్ని రికార్డుల్లో నుంచి తొలగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. గతంలో కూడా తమ సభ్యులపై ఏకవచనంతో మాట్లాడారు.. శాసనసభలో, మండలిలో బీఆర్ఎస్ సభ్యులకు సముచిత స్థానం కల్పించడం లేదని తెలిపారు. అసెంబ్లీలో తమ సభ్యులను సస్పెండ్ చేయడం.. మండలిలో తమ మీద ఆన్ పార్లమెంటరి వర్డ్స్ వాడటం చుస్తే ప్రభుత్వం కక్షపురితంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం అవుతుందని కవిత పేర్కొన్నారు. మరోవైపు.. ముఖ్యమంత్రికి తెలంగాణ ఉద్యమంలో పాత్ర లేదు.. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలు తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా ఉంటున్నాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ముస్లిం, లంబాడా వారికి చోటు దక్కలేదని కవిత ఆరోపించారు.

## బాల్కొండలో 31 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు

హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరుగుతోంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సంబంధించిన చర్చలో పాల్గొన్న బీఆర్ఎస్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ప్రభుత్వం చెబుతున్నట్టుగా రాష్ట్రంలో ఎక్కడా పూర్తి రుణమాఫీ కాలేదని అన్నారు. దీనికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ తాము పూర్తిస్థాయిలో రుణమాఫీ చేశామని, లెక్కలతో సహా వెల్లడిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గం అంశాన్ని భట్టి ప్రస్తావించారు. బాల్కొండలో కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యిందన్నారు. దీనిపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియోకవర్గంలో మొత్తం 51 వేల మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉంటే కేవలం 20 వేల మందికే రుణాలు మాఫీ చేశారని చెప్పారు. ఇంకా 31 వేల మందికి రుణమాఫీ కాలేదని అన్నారు. అంతేగాక బీఆర్ఎస్ హయాంలో రెండు విడతల్లో చేసిన రుణమాఫీ కంటే ఇప్పటి కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ చాలా తక్కువగా ఉందని విమర్శించారు. నేను చెప్పింది అవాస్తవమైతే చర్చకు ఇచ్చే సమాధానంలో ఆ విషయాన్ని ప్రస్తావించాలని అన్నారు.

మా మీద ఏడుపు ఇంకెన్నాళ్లు..

రుణమాఫీ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్



ప్రభుత్వాన్ని నిలదీయడంతో కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. మీ హయాంలో ఏం చేశారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తీరును వేముల ఎద్దేవా చేశారు. మేం ఏం చేశామనేది గతమని, మీరేం చేస్తున్నారో చెబుతుంటే మా మీద ఏడవడం దేనికని ప్రశ్నించారు. మీరు అధికారంలోకి వచ్చి 17 నెలలు పూర్తయ్యిందని, 17 నెలలుగా మా మీద ఏడుస్తూనే ఉన్నారని, ఇంకెన్నాళ్లు ఏడుస్తారని..? వ్యంగ్యంగా ప్రశ్నించారు.

## దేశంలో ఎక్కడా హిందీ భాషను రుద్దడం లేదు



హైదరాబాద్,తమిళనాడులో త్రిభాషా వివాదం రగులుకుంటోంది. రాష్ట్ర బడ్జెట్ లోగో నుంచి రూపాయి చిహ్నాన్ని స్టాలిన్ ప్రభుత్వం తొలగించింది. ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.తాజాగా దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. త్రిభాషా పాలసీ కొత్తది కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఈ విధానం కొనసాగుతుందని అన్నారు. నచ్చిన భాషలో చదువుకోవచ్చు. దేశంలో ఎక్కడా హిందీ భాషను రుద్దడం లేదని చెప్పారు.ఇతర దేశాల్లో కూడా మాతృభాషలోనే మాట్లాడుతారు. డీఎంకే ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది. దేశంలో నూతన విద్యా విధానం వచ్చాక మాతృభాషకు ప్రోత్సాహం ఇచ్చాం. తమిళనాడులో ఎన్నికల సమయం దగ్గర పడుతుంది కాబట్టి ప్రజలను రెచ్చ కొట్టి అధికారం చేపట్టడం కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. నాలుగున్నర సంవత్సరాలలో తమిళ భాష అభివృద్ధికి స్టాలిన్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.దేశంలోని అన్ని ప్రాంతీయ భాషల్లోని సినిమాలు దేశవ్యాప్తంగా మంచి ఫలితాలు అందిస్తున్నాయి. నియోజకవర్గ పునర్విభజనపై కొత్త నియమాలు రాలేదు. ఇంకా జనగణన జరగలేదు. ఈ అంశంపై ఏబిసిడిలు తెలియని సీఎం రేవంత్ యుద్ధం చేస్తా అని అంటున్నారు. దక్షిణ భారత ప్రజలు చైతన్యవంతులయ్యారు అక్షరాస్యత పెరిగింది. మీ పిచ్చి మాటలు నమ్మరు. రాజకీయ దురుద్దేశంతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే ప్రజలు నమ్మరని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## వివేకా హత్య కేసుపై వైఎస్ సునీత సంచలన వ్యాఖ్యలు..

హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల్లో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు సంచలనం సృష్టించింది.. అయితే, ఇటీవల ఈ కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగయ్య మృతిచెందడంతో..అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయడం.. రీపోస్టుమార్టం నిర్వహించడం.. దీనిపై దుమారం రేగడం చర్చగా మారింది.. ఇక, తన తండ్రి హత్య కేసుపై సంచలన వ్యాఖ్యలు చేశారు వైఎస్ వివేకా కూతురు వైఎస్ సునీతారెడ్డి.. వైఎస్ వివేకానంద రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివేకానంద రెడ్డి హత్యకేసులో న్యాయం కోసం ఆరు సంవత్సరాలుగా పోరాడుతున్నాను..

ఒకరు తప్ప మిగిలిన వారంతా బయట లక్షణంగా ఉన్నారన్నారు..ఇక, వైఎస్ వివేకా కేసులో ఇన్వెస్టిగేషన్ ఆగిపోయిందన్నారు వైఎస్ సునీత.. ఈ దారుణమైన హత్య గురించి పోరాడుతూనే ఉన్నా.. ఇంత అన్యాయం జరిగినా.. నాకు న్యాయం జరగలేదన్నారు.. అయినా, న్యాయపోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఎంతవరకైనా పోరాటం చేస్తానన్న సునీత.. నిందితుల కంటే మాకు, మా కుటుంబానికి ఎక్కువ శిక్ష పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.. సీబీఐ మళ్లీ విచారణ మొదలు పెడుతుంది.. నాకు కచ్చితంగా న్యాయం



జరుగుతుంది అనే నమ్మకం ఉందన్నారు.. మరోవైపు, నిందితులు సిస్టమ్ మేనేజ్ చేస్తున్నారు.. సాక్షులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాక్షులపై ఒత్తిడి జరుగుతోంది, అలా జరగకూడదు అన్నారు.. అయితే, సాక్షుల మరణాల వెనుక అనుమానాలు ఉన్నాయంటూ సంచలన ఆరోపణలు చేశారు వైఎస్ సునీతారెడ్డి..

## మాదే తప్పు అయితే క్షమాపణ చెప్తా...

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోనే కృష్ణా బేసిన్ జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంలో తమతో చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో కాంగ్రెస్ తప్పు ఉంటే క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పుకొచ్చారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ..'గవర్నర్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. గతంలో గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు జరిగాయి. బలహీనవర్గాలకు చెందిన మహిళ గవర్నర్‌గా ఉంటే.. ఆమెను సూటిపోటి మాటలతో అవహేళన చేశారు. భారత రాజ్యాంగం స్ఫూర్తితో వ్యవస్థలు ఏర్పడ్డాయి. రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గత ప్రభుత్వం ప్రజాస్వామ విలువలను పాటించలేదు. అజ్ఞానమే గొప్ప విజ్ఞానం అనుకుంటున్నారు. గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కార్యకర్త ప్రసంగంలా ఉందని కొందరు అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. గవర్నర్‌ను గౌరవించే బాధ్యత మాది. ?ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశాం.. వాటినే గవర్నర్ ప్రస్తావించారు. మాట్లాడాలనుకున్నదే మాట్లాడతాం. ఎవరు అడ్డుకున్నా వెళ్లిపోతాం అన్నట్టుగా ఉంది బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందన్నారు. రైతుల ఆత్మహత్యలకు అప్పులే కారణం. అవమానాలు భరించలేకనే రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. రుణాల నుంచి రైతులను విముక్తి చేయాలని నిర్ణయించాం. వాస్తవాల మీద ప్రభుత్వాన్ని నడపాలని చూస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశాం. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. రైతులు ఆత్మగౌరవంతో బతకాలన్నదే మా విధానం. గతంలో ఎన్నికప్పుడే రైతుబంధు అన్నదాత అకౌంట్లలో పడేది. మార్చి 31 నాటికి రైతులందరికీ రైతుభరోసా అందిస్తామన్నారు. గతంలో ఎక్కడ పంట పండినా కాళేశ్వరం వల్లే అని చెప్పుకున్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత 260 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను పండించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేసింది. గతంలో కేసీఆర్ వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని అన్నారు. కానీ, మేము అధికారంలోకి వచ్చాక రైతులను వరి పండిచాలని కోరాం. కేసీఆర్ హయాంలోనే కృష్ణా బేసిన్ జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగింది. కృష్ణా నీటి విషయంలో కేసీఆర్ సంతకం చేసి తెలంగాణకు మరణశాసనం రాశారు. మా తప్పు ఉందని నిరూపిస్తే సభ సాక్షిగా కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నేతలకు క్షమాపణ చెబుతాను. కేసీఆర్



అసెంబ్లీకి వచ్చినప్పుడే కృష్ణా జలాలపై చర్చ పెడతాం. లెక్కలతో సహా నిరూపిస్తాను.. చర్చకు సిద్ధమా? అని సవాల్ చేశారు.గల్లీ నుంచి ఢిల్లీ వరకు నీటి కోసం పోరాటం చేస్తున్నాం. నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే కేసీఆర్ సభకు రాకుండా మొహం చాటేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి తీసుకోవాల్సిన నీళ్లను శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకుంటామన్నది నిజం కాదా?. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్న పెంచితే తెలంగాణ ఎడారి అవుతుందని పీజేఆర్ అడ్డుకున్నారు. గతంలో ఎక్కడ పంట పండినా కాళేశ్వరం వల్లే అని చెప్పుకున్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత 260 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను పండించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేసింది. గతంలో కేసీఆర్ వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని అన్నారు. కానీ, మేము అధికారంలోకి వచ్చాక రైతులను వరి పండిచాలని కోరాం.కవిత ఓడిపోతే ఎమ్మెల్సీ ఇచ్చారు.. సంతోష్‌కు రాజ్యసభ ఇవ్వలేదా?. మీ ఇంట్లో అందరికీ ఉద్యోగ అవకాశాలిచ్చారు.. పదేళ్లు ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు?. మీరు ఇచ్చిన నోటిఫికేషన్లు తక్కువ, పెట్టిన పరీక్షలు ఎక్కువ. పరీక్ష పేపర్లను పల్లీ బఠానీల్లా అమ్మేశారు. గత ప్రభుత్వంలో పరీక్షా పత్రాలను జిరాక్స్ సెంటర్‌లలో అమ్మేసింది. టీఎస్‌పీఎస్సీ ప్రతిష్టను దిగజారిస్తే మేం ప్రక్షాళన చేశాం. ఒక్క ఏడాదిలోనే 57,924 ఉద్యోగాలు ఇచ్చాం. 19 శాతం నిరుద్యోగాన్ని తగ్గించిన ఘనత మాది. విద్యాశాఖను మేం ప్రక్షాళన చేశాం. 20 ఏళ్లు ప్రమోషన్, 10 ఏళ్లు ట్రాన్స్‌ఫర్ లేని వారికి శుభవార్త అందించాం. చిన్న వివాదం కూడా లేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం. గ్రూప్-2,3,4 పరీక్షల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేశాం' అని తెలిపారు.

## ఇంత సైంటిఫిక్‌గా కుల గణన ఎప్పుడూ జరగలేదు..



హైదరాబాద్,అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణపై నిబద్ధతతో ఉన్నామని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు అమలు చేసిన ఘనత తమ సీఎం, ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు.బీసీ కుల గణన లెక్కలు తప్పు అంటున్నారు.. ఇంత సైంటిఫిక్?గా కుల గణన ఎప్పుడూ జరగలేదని వెల్లడించారు. 1931 తర్వాత.. ఇప్పుడు తాము చేశామని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజ్వేషన్లను ఇవ్వాలని నిర్ణయించింది కూడా తామేనని అన్నారు. బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు.. సమగ్ర సర్వే చేసి సభలో పెట్టేంత ధైర్యం కూడా చేయలేదని విమర్శించారు. పబ్లిక్ డొమైన్‌లో కూడా పెట్టలేదు.. మీరు బీసీలకు వ్యతిరేకం అందుకే పట్టించుకోలేదు.. మీ సర్వే పబ్లిక్ డొమైన్‌లోనే పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల సంఖ్య 6 శాతం పెరిగింది.. మీరు సర్వే చేశాం అని చెప్తున్న దాంట్లో కంటే బీసీ సంఖ్య పెరిగిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మీరు మమ్మల్ని విమర్శిస్తున్నారు.. సర్వేలో మీరే పాల్గొనలేదని బీఆర్ఎస్ పై మండిపడ్డారు. ఇంకా ఎవరైనా సర్వేలో పాల్గొనక పోతే మళ్ళీ గడువు ఇచ్చామని అన్నారు.పులిచింతల ప్రాజెక్ట్ గురించి మీకు ఏం తెలుసు.. పులిచింతలతో తెలంగాణకి నష్టం లేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కృష్ణా నది ఆయకట్టు నుండి ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచానన్నారు. కృష్ణా జలాల్లో 812 టీఎంసీలో ఏపీకి 512 టిఎంసీలు ఇచ్చింది కేసీఆర్, హరీష్ అని దుయ్యబట్టారు. తాము వచ్చాక కృష్ణా నీటి వాట పంపకాల అంశం ఓపెన్ చేశామని తెలిపారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు కనీసం టెలిమెట్రిక్ మిషన్ కూడా పెట్టలేక పోయారు.. బీర్ఎస్ హయంలో కృష్ణానది జలాలను తరలించడానికి ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా నది జలాల్లో తెలంగాణ రాష్ట్రానికి, రైతాంగానికి సరైన నీరు రావడానికి నిరంతరం పోరాటం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## మరో దుందుడుకు చర్య దిశగా ట్రంప్?

వాషింగ్టన్,మార్చి15: ఉద్యోగాల కోతలు, దేశాలపై సుంకాలతో దూకుడు పాలన సాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. పదుల కొద్దీ దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే అంశాన్ని ట్రంప్ సర్కారు పరిశీలిస్తున్నారని సమాచారం. 41 దేశాల పౌరులు అగ్రరాజ్యంలోకి రాకుండా త్వరలో ప్రయాణ ఆంక్షలు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

ఇందుకు సంబంధించి ఒక ఇంటర్నల్ మెమో బయటికొచ్చింది. అందులో మొత్తం ఈ 41 దేశాలను మూడు గ్రూప్‌లుగా విభజించినట్లు సమాచారం. పది దేశాలతో ఉన్న మొదటి గ్రూప్‌లో అఎ÷-గానిస్థాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తరకొరియా వంటివి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాల పౌరులకు వీసాల జారీ పూర్తిగా నిలిపివేయ నున్నారని ప్రచారం. ఇక, రెండో గ్రూప్‌లో ఇరిట్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆ మెమోలో పేర్కొన్నారు. ఈ దేశాలకు పర్యటక, విద్యార్థి వీసాల వంటివి జారీ చేయకూడదని భావిస్తున్నారు. అయితే వీటికి కొన్ని మినహాయింపులు కల్పించే అవకాశాలున్నాయి. మూడో గ్రూప్‌లో పాకిస్థాన్, భూటాన్ సహా 26 దేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాలు 60 రోజుల్లోపు తమ 'లోపాలను పరిష్కరించుకోవడానికి' ప్రయత్నాలు చేయకపోతే అక్కడి పౌరులకు వీసా జారీని పాక్షికంగా నిలిపివేయాలని యూఎస్ యంత్రాంగం భావిస్తున్నట్లు ఆ మెమోలో ఉంది. ప్రస్తుతానికి ఈ జాబితాను అమెరికా మీడియా సంస్థలు ప్రచారం చేయగా.. ఇందులో మార్పులు ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆమోదం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయం లోనూ ఇలాంటి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్ సహా ఏడు ముస్లిం మెజారిటీ దేశాల ప్రయాణికులపై నిషేధం విధించారు. అప్పట్లో ఈ నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ఇక, 2023లోనూ ట్రంప్ ఈ ప్రణాళికల గురించి ప్రస్తావించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపడితే గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, సిరియా యెమెన్ వంటి దేశాల నుంచి పౌరుల రాకపై ఆంక్షలు విధిస్తానని తెలిపారు. దేశ భద్రతకు ముప్పు అని భావించేవారిని అమెరికాలోనికి ఎన్నటికీ రానివ్వబోమని అన్నారు.



## సంపాదకీయం

ఆదివారం 16-03-2025

# జనాభా పెరుగుదల... దుర్మార్గపు ఆలోచన !

రాజకీయ నాయకుల ఆలోచనలు..వారి చర్యలు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో తాజాగా జరుగుతున్న ఉదంతాలే నిదర్శనం. ముఖ్యంగా తమిళనాట డిఎంకె చేస్తున్న విన్యాసాలు జుగుప్సను కలిగిస్తున్నాయి. దీనికి కొన్ని రాజకీయ పార్టీలు వంతపాడుతున్నాయి. వీరి ఆలోచనలను ప్రథమంగా ప్రజలు పాతరేయాలి.హోళీ సందర్భంగా వీరి దురాలోచలనను తగలబెట్టాలి. వారి దుర్మార్గాలపై రసాయన రంగునీళు చల్లాలి. అవసర మైతే ఎక్కడిక్కడే నిలదీయాలి. రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తారని గుర్తించాలి. ఇందులో ఒకటి నియోజకవర్గాల పునర్విభజన...మరోటి జనభా పెరుగుదల. వీటితో పాటు హిందీ వ్యతిరేకత. జనాభా పెరుగుదల గురించి రాజకీయ పార్టీలు విపరీత వ్యాఖ్యలు చేస్తున్నాయి. ఇప్పటికే జనవిస్ఫోటనంతో దేశంలో ఆకలి, దరిద్రాలను అనుభవిస్తోంది. ఉన్న జనానికే సౌకర్యలు లేవు. ఉద్యోగాలు లేవు. ఉపాధి లేదు. దేశం వీరిని భరించే స్థితిలో లేదు. ఈ సమయంలో జనాభా నియంత్రణ గురించి మాట్లాడాల్సిన రాజకీయపార్టీలు తమ సీట్ల రాజకీయ కోసం జనాభాను పెంచాలన్న ప్రతిపాదనతో వస్తున్నాయి. విజినరీ చంద్రబాబు కూడా జనాభా గురించి మాట్లాడుతున్నారు. మరి ఆయన తనయుడు ఒక్కరినే ఎందుకు కన్నారో చెప్పాలి. జనాభా కారణగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు తగ్గుతాయన్న భయంతోజనాభా పెరగాలన్న డిమాండ్‌ను డిఎంకె చేపట్టింది. వీరీ సీట్ల కోసం జనం త్యాగాలు చేయాలి. పిల్లలను కని రోడ్డున పడేయాలి. వారేమైనా ఫర్వాలేదు. వీరికి మాత్రం సీట్లు పెరిగితే, సీట్లతో రాజకీయ పదవులను అనుభవించవచ్చు. ఇదీ వీరి రాజకీయం. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉండదు. జనాభా పెరుగుదల అన్నది భారత్‌ను ఎంతగా దెబ్బతీస్తున్నదో తెలుసుకోలేని మూర్ఖ రాజకీయ నేతలు మనకు దాపురించారు. ఈ విషయాల్లో తమిళనాడులోని డిఎంకె రచ్చ చేస్తోంది.పిల్లలను కనండి అంటూ తండ్రీ కొడుకులు స్టాలిన్, ఉదయనిధులు ఢంకా బజాయిస్తున్నాయి. ఎందుకంటే మరోమారు అధికారంలోకి రావాలంటే రచ్చచేయాలి. అందుకే ఏడాది ముందునుంచే పక్కా ప్రణాళికతో రచ్చను మొదలు పెట్టారు. దానిని డిఎంకె తమిళనాడు నుంచి ఢిల్లీ వరకు తీసుకుని వెళ్లింది. ప్రధానంగా హిందీ వ్యతిరేకతను పరిశీలిస్తే.. ప్రజలు తమిళం తప్ప ఇతర భాషలు నేర్చుకుంటే ఎక్కడ తమ పీఠాలు కదులుతాయో అన్న భయం ముందు నుంచీ వీరికి ఉంది. తమిళనాడులో హిందీని ప్రవేశించకుండా చేయడంలో వీరి ఉద్దేశం అదే. ప్రజలు హిందీ నేర్చుకుంటే ఎక్కడ జాతీయ రాజకీయాల ప్రభావంలో పడిపోతారో అన్న భయమే వీరి హిందీ వ్యతిరేకతకు కారణం. విద్యార్థి దశ నుంచే ఇంగ్లీష్, హిందీ లాంటి భాషలు నేర్చుకుంటే దేశంతో పాటు, ప్రపంచాన్ని చుట్టి రావాచ్చు. దేశంలో సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునే వీలుంటుంది. కానీ దీనిని వ్యతిరేకించడం ద్వారా ప్రజలను తమిళానికే పరిమితం చేయాలన్న దుర్మార్గపు ఆలోచన డిఎంకెదని చెప్పడంలో తప్పులేదు. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంతమంచిదని తాజాగా రాజ్యసభ ఎంపి సుధామూర్తి చేసిన వ్యాఖ్యలు కనువిప్పు కావాలి. అలాగే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా పలు సందర్భాల్లో లోక్‌సభ వేదికగా హిందీవ్యతిరేకతపై తమిళ పార్టీలను ఏకిపారేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేస్తున్న కొద్దీ ఈ పక్రియపై వివాదాలు సృష్టించే పనిలో డిఎంకె పడింది. కేవలం సీట్ల గురించి మాట్లాడితే బాగోదని జనాభా తగ్గుదల, హిందీ వివాదాన్ని డిఎంకె నెత్తికెత్తుకుంది. ఇప్పటికే 140 కోట్లు దాటిన భారత జనాభా ఇంకా పెరగాలి. సీట్లు పెరగాలి. తాము మాత్రమే అధికారంలో ఉండాలి అన్న ధోరణిలో రాజకీయ పార్టీల విన్యాసాలు ఉన్నాయి. దేశాన్ని కులాల వారీగా విభజించే పనిలో కాంగ్రెస్ పడింది. జనాభా పేరుతో డిఎంకె, టిడిపిలు విపరీత విన్యాసాలు మొదలు పెట్టాయి. పునర్విభజన వల్ల తీవ్రంగా నష్టపోయే దక్షిణాది రాష్ట్రాలేనని ఓ పసలేని వాదనను తెరపైకి తెచ్చారు స్టాలిన్. అఖిలపక్ష భేటీకి పిలుపునిచ్చారు. అన్ని పార్టీల నేతలకు, ముఖ్యంగా దక్షిణాది నేతలకు లేఖలు రాసారు.ఈ క్రమంలో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు పునర్విభజన విధివిధానాలను తప్పుబడుతూ, జనాభా ప్రాతిపదికన కాకుండా దేశ ఆర్థికాభివృద్ధిలో తమ తమ రాష్ట్రాల భాగస్వామ్యం ఆధారంగా పునర్విభజన జరగాలంటున్నారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి.. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదిన ఒక్క సీటు కూడా తగ్గదని చెప్పారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే చెప్పారు. అయితే వీరి బాధ ఇది కాదు. రచ్చ చేయడం ద్వారా ప్రజల్లో ఇమేజ్ పెంచుకునే ఆలోచనలో డిఎంకె ఉంది. గతంలో రాహుల్ రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని, రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిందని ఊరూవాడా తిరిగారు. జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజన వల్ల తీవ్రంగా నష్టపోయేది దక్షిణాది రాష్ట్రాలే కనుక ఇప్పటినుంచి పిల్లలను కనాలని డిఎంకె ఇచ్చిన పిలుపును టిడిపి కూడా అందుకుంది. ఎపిలో ఉన్న వనరులతో అభిశృద్ధి చేయలేక గతంలోనే జగన్ చతికిల పడ్డారు. ఉన్న డబ్బును పెన్షన్లకే వెచ్చిస్తున్నారు. ఇదే పెద్ద పానా విజయంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ దశలో జనాభా పెంచాలని చంద్రబాబు లాంటి విజినరీనేత మాట్లాడడం ఆశ్చర్యంగా ఉంది. జనాభా ప్రాతిపదికన ఓ సీటు తగ్గితే కొంపలేం మునుగుతాయి. కుటుంబ నియంత్రణపై గతంలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషి వల్ల జనాభా తగ్గిందని అంటున్నారు. ఇదే నిజమైతే..ఉత్తరాదిలో కూడా ఇలాగే చేయాలని డిమాండ్ చేయాలి. ఉత్తరాదిలో కూడా జనాభా నియంత్రణ చర్యలకు చంద్రబాబు సూచనలు చేయవచ్చు. కుటుంబ నియంత్రణపై కేంద్రంలోని పెద్దలు గతంలో ఇచ్చిన ఆదేశాలను తూచ తప్పక పాటించి, జనాభా పెరుగుదలను నియంత్రించేచేలా చేయాలి. ఇప్పుడున్న దేశానికి ఇంత జనాభా అసవరం లేదని గుర్తించాలి. జనాభాతో సీట్లు దక్కించుకునే దుర్మార్గపు ఆలోచన వియరమించి జనాభా నియంత్రణకు పూనుకోవాలి. దేశవ్యాప్తంగా ఇది అమలు కావాలి. హిందీ వ్యతిరేకేతను డిఎంకె వీడాలి. ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్న పార్టీలకు ప్రజలు సమయం చూసి బుద్ధి చెప్పకపోతే నష్టపోయేది మనమేనని గుర్తించాలి.

# పంచాయతీ కార్మికుల శ్రమకు గుర్తింపు ఏదీ?

విజయవాడ:రాష్ట్రంలో సుమారు 13,700 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్, బిల్ కలెక్టర్ తదితర విధులు నిర్వహించేవారు 28 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. 'స్వచ్ఛ భారత్' పథకం పేరుతో తొలుత 32 వేల మందిని నెలకు రూ.6000 వేతనం కింద నియమించారు. ప్రస్తుతం వీరి సంఖ్య సగానికి తగ్గిపోయింది. వీరుకాక మరో 700 మంది ఎన్ఎంఆర్ కార్మికులు పంచాయతీలలో ప్రజలకు సేవలందిస్తున్నారు.



కోతలే-చేతల్లేవు

నెలల తరబడి జీతాలు పెండింగ్

పంచాయతీ కార్మికులందరూ ఒకే విధమైన చాకిరి చేస్తున్నారు. కానీ వీరికి జీతాలు మాత్రం ఒకే రీతిగా చెల్లించడంలేదు. నెలకు రూ.5 వేల నుండి రూ.12 వేలు చెల్లిస్తున్నారు. 12 వేల రూపాయలు పొందేవారు నూటికి ముగ్గురు నలుగురు కూడా ఉండరు. అత్యధిక మందికి రూ.7 వేల నుండి రూ.9 వేల మధ్య చెల్లిస్తున్నారు. ఈ జీతాలు కూడా ప్రతి నెలా చెల్లించరు. 4 నుండి 18 నెలలు బకాయిలు పెడుతున్నారు. జీతాలు సకాలంలో రాక, కొత్త అప్పులు పుట్టక%ౌ% కిరాణా షాపు యజమానుల ఒత్తిళ్లు, వడ్డీ వ్యాపారుల వేధింపులతో పంచాయతీ కార్మికులు అవస్థలు పడుతున్నారు. బకాయి జీతాలు అడిగితే "మేము ఇచ్చినప్పుడు తీసుకో", "అట్లా ఇష్టమైతే పని చెయ్యి. లేకపోతే మానుకో" అంటూ బెదిరింపులు నిత్యకృత్యం.

1999లో జారీ చేసిన జీవో నేటికీ అతీగతీ లేదు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ కార్మికుల పోరాట ఫలితంగా 1999లో 551 జీవోను నాటి ప్రభుత్వం జారీ చేసింది. అందులో పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ తోపాటు ప్రతి ఏటా టెండర్ల ద్వారా నియామకాలు జరపాలని వుంది. వీటితో కేవలం టెండర్ల విధానం మాత్రం ఆ నాటి నుండి పక్కాగా అమలు చేస్తున్నారు. మిగిలిన ఏ ఒక్కటీ అమలు చేయలేదు. రాష్ట్ర విభజన తర్వాత 2017, 2018 సంవత్సరాలలో జరిగిన పోరాటాల ఫలితంగా 132 జీవో జారీ చేశారు. దీనికీ అదే గతి పట్టించారు. గ్రీన్ అంబాసిడర్లకు 2020 జనవరి నుండి నెలకు రూ.10,000 చెల్లిస్తామంటూ 2019 అక్టోబర్‌లో 680 జీవో జారీ చేశారు. ప్రస్తుతం ఆ జీవో వెబ్‌సైట్‌లో కనిపించడంలేదు. ఎన్ఎంఆర్ లకు టైంస్కేల్, జీతం చెల్లిస్తామంటూ 142 జీవో జారీచేశారు. కానీ ప్రభుత్వం జీతాలు చెల్లించకుండా పంచాయతీల మీదకు నెట్టేసింది.గతంలో తెలుగుదేశం అధికారంలో ఉండగా పంచాయతీ కార్మికులను 'మల్టీ పర్పస్ వర్కర్లు'గా కొత్త నామకరణం అయితే చేసింది. ప్రతి కార్మికుడికి నెలకు రూ.10,000 తక్కువ కాకుండా జీతం చెల్లించాలని 2019 ఫిబ్రవరి 13న జీవో నెం.57 జారీ చేసింది. గత వైసిపి ప్రభుత్వం పంచాయతీ కార్మికుల జీతభత్యాల గురించి పట్టించుకోలేదు. కార్మికుల జీతాలు పెంచాలని, జీవోలు అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసనలు నిర్వహిస్తే అక్రమ అరెస్టులు, కేసులు బనాయించి నిరంకుశంగా వ్యవహరించింది.

కోర్టు తీర్పులు బేఖాతరు

ఎవరు తక్కువ వేతనాలకు టెండర్ వేస్తే వారికి పని దొరకడం వల్ల వేతనాలు పెరగకపోగా నానాటికీ దిగజారి పోయి కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా దివాళా తీయడం, కార్మికుల మధ్య పోటీ పెట్టి అధికార యంత్రాంగం, దళారీలు కార్మికులను దోచుకు తినడంతో, ఉమ్మడి చిత్తూరు జిల్లా యూనియన్ నాయకత్వం 2015లో హైకోర్టును ఆశ్రయించింది. "గతం నుండి విధులు నిర్వహిస్తున్న వారికి కొత్తగా టెండర్లు అవసరం లేదు. విధుల్లో కొనసాగించాలి. అంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. వీటి అమలుకు రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ, ముఖ్య కార్యదర్శి, కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ అధికారులను బాధ్యులుగా చేశారు.అయినా హైకోర్టు తీర్పును అధికార యంత్రాంగం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే 2023లో కంటెమ్ట్ ఆఫ్ కోర్ట్ ద్వారా మరలా కేసు వేస్తే హైకోర్టు పాత ఉత్తర్వులను అమలు చేయాలని చెప్పింది. అయినా నేటికీ అమలుకు నోచుకోలేదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడుస్తోంది. దేశంలో, రాష్ట్రంలో పాలకులు మారుతున్నారు కానీ పంచాయతీ కార్మికుల జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వున్నాయి. తాము అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులను అందలమెక్కిస్తామని వాగ్ధానాలు కురిపించడం, తీరా గద్దెనెక్కాక మొండి చెయ్యి చూపడం రివాజుగా మారింది. పంచాయతీ కార్మికుల జీతాలు, పి.ఎఫ్, ఇఎస్ఐ గురించి అడిగినప్పుడు పాలకవర్గాలు, అధికారులు పంచాయతీ కార్మికులకు ఇవన్నీ ఎట్లా అమలవుతాయి? "పంచాయతీల దగ్గర నిధులెక్కడున్నాయి"? అంటూ ఎదురు దాడి చేయటం పరిపాటిగా మారింది. గ్రామ పంచాయతీ కార్మికుల్లో చదువు తక్కువుగా ఉండటం, రాజ్యాంగ హక్కులను అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం పాలక వర్గాలకు అనుకూలంగా మారడం, పంచాయతీలపై ఆధిపత్య కులాలవారి పెత్తనం కొనసాగడంతోపాటు, కార్మికులలో అత్యధికులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకు చెందిన పేదవారు కావడం వల్ల వీరు తిండికి కూడా గతి లేక పస్తులతో కాలం గడపాల్సి వస్తున్నది.ప్రతి ఐదేళ్ళకోసారి ఎన్నికలు జరిగి పాలకులు మారినప్పుడల్లా వందలాది మంది గ్రామ పంచాయతీ కార్మికులను అక్రమంగా ఉద్యోగాల నుండి తొలగించి కార్మికుల కుటుంబాలకు రోడ్డున పడేస్తున్నారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టులు ఉత్తర్వులిచ్చినా వాటిని కూడా బుట్ట దాఖలు చేస్తున్నారు.

'స్వచ్ఛ' నినాదాలు ఎవరి కోసం?

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ అంటే, రాష్ట్రంలో నిన్నటిదాకా ఉన్న వైసిపి, నేడు టిడిపి కూటమి ప్రభుత్వాలు "స్వచ్ఛాంధ్ర" నినాదాన్ని మోత మోగిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు పవన్ కల్యాణ్ "పచ్చదనం పరిశుభ్రత" గురించి గొప్పలు చెప్తున్నారు కానీ, వీటన్నింటికీ మూలమైన పంచాయతీ కార్మికుల వెతల గురించి పట్టించుకోవడం లేదు. గత ఏడు నెలలుగా మంత్రిగారు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు. గత పదేళ్ళుగా జీతాలు పెరగలేదు. మరోవైపు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీల భారాలతో పంచాయతీ కార్మికుల జీవితాలు కునారిల్లిపోతున్నాయి.

కూటమి ప్రభుత్వమైనా ఆలకిస్తుందా?

రాష్ట్రంలో 9 నెలల క్రితం అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మా కష్టాలు తీర్చకపోతుందా? అని గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. శాసన సభలో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిన చంద్రన్న ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఒక్క పైసా కూడా విదల్చలేదు.ఈ నేపథ్యంలో తమ శ్రమను గుర్తించాలని, పోరాడి సాధించుకున్న 551, 132, 142, 680 జీవోలను అమలు చేయాలని, జీతాలు పెంచాలని, ప్రతి నెలా జీతాలు చెల్లించాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎ.పి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 2025 మార్చి 17న విజయవాడలో మహా ధర్నాను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వీరి గురించి స్పందిస్తాయో లేదో వేచి చూడాలి.

# సంక్షేమ పథకాల్లో ఎక్కడా వివక్ష లేదు



అమరావతి, ఏ స్థాయిలో కూడా వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదని స్పష్టం పార్టీ నేతలకు చంద్రబాబ నాయుడు మరోమారు స్పష్టం చేశారు. నేను ఈ విషయాన్ని చెప్తే వైసీపీకి ఓటు వేసిన వారికి పథకాలు ఇవ్వొద్దని చెప్పినట్లు ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆయన.. సంక్షేమ కార్యక్రమాల అమల్లో వివక్ష ఉండదు.. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నాం.. సంక్షేమ పథకాలు వేరు, రాజకీయ పరమైన సంబంధాలు వేరన్నారు. వైసీపీ వారిని దరిచేరనివ్వొద్దని సూచించారు.. మరోవైపు, నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నాం. పేర్లను సిఫారసు చేయకుండా కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని.. వీలైనంత త్వరగా పార్టీ కోసం కష్టపడిన వారి వివరాలను నామినేటెడ్ పదువుల కోసం అందించాలి. సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తాం.. రాష్ట్రం వ్యాప్తంగా 21 ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్‌లను నియమిస్తాం అని అన్నారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం.. పాలనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయన్న ఆయన.. జిల్లాల్లో ఇంఛార్జ్ మంత్రులు తప్పనిసరిగా పర్యటించాలని స్పష్టం చేశారు.. అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించాలి. జిల్లాలకు వెళ్లే సమయంలో ఆయా జిల్లా కో-ఆర్డినేటర్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు మంత్రులు సమాచారం అందించాలి. గ్రూపు రాజకీయాలకు ఎక్కడా తావు ఇవ్వకూడదు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో ఫోకస్ పెట్టాలి. పర్యటనల సంఖ్య పెరగాలి. కార్యకర్తలు, నాయకులతో మమేకమవ్వడంతోపాటు జిల్లా పార్టీ కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలని ఆదేశించారు.నామినేటెడ్ పదవుల కోసం 60 వేల దరఖాస్తులు వచ్చాయి.. అన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నాం. పదువులు తీసుకున్నట్లు కాదు? ఎన్నికల్లో ప్రభావం చూపించాలని సూచించారు. మొదటిసారే పదవులు రాలేదని అనుకోవద్దు? రెండేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత మిగిలినవారికి అవకాశాలు కల్పిస్తామన్న ఆయన.. ఇప్పటికే పదవులు తీసుకున్న వారి ప్రతిభను పర్యవేక్షిస్తున్నాం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నామో ఇప్పుడూ అంతే హుందాగా వ్యవహరించాలి. ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిపాలన మనం అందించాలి. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడం మన విధానం. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి గ్రామంలో అమలు చేసేందుకు ఎమ్మెల్యేలు, నేతలు చొరవ తీసుకోవాలి. 2 కిలోవాట్‌ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు రూ.20 వేల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనంగా అందిస్తాం. కేంద్రం ఇచ్చే రాయితీతో కలిపి బీసీలకు రూ.80 వేల మేర రాయితీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తాం. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటే లక్ష్యం పెట్టుకోవాలన్నారు.. ప్రతి ఎమ్మెల్యే అసెంబ్లీలో, ఎంపీలు పార్లమెంట్‌లో మీ నియోజకవర్గ సమస్యలను లేవనెత్తి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను కలుపుకుని ప్రజాప్రతినిధులు ముందుకెళ్లాలని సూచించారు. పాలనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. జిల్లాల్లో ఇన్‌చార్జ్ మంత్రులు తప్పనిసరిగా పర్యటించాలని ఆదేశించారు. అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. జిల్లాలకు వెళ్లే సమయంలో ఆయా జిల్లా కో-ఆర్డినేటర్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు మంత్రులు సమాచారం అందజేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. గ్రూపు రాజకీయాలకు ఎక్కడా తావు ఇవ్వకూడదని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో ఫోకస్ పెట్టాలని.. పర్యటనల సంఖ్య ఇంకా పెరగాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులతో మమేకమవ్వడంతోపాటు జిల్లా పార్టీ కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలని సూచించారు.

# బంగారం తుప్పు పడుతోంది

హైదరాబాద్,ఓఎంసీ కేసులో భాగంగా తమ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న 53 కిలోల బంగారు నగలు తుప్పుపట్టిపోతాయంటూ గనుల వ్యాపారి గాలి జనార్దన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఆ నగలతో పాటు తమ వద్ద సీజ్ చేసిన నగదు, రూ.5 కోట్ల విలువైన బాండ్లను విడుదల చేయాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన కుమార్తె జి.బ్రాహ్మణి, కుమారుడు జి.కిరీటిరెడ్డి పిటిషన్లు దాఖలు చేయగా, తెలంగాణ హైకోర్టు వాటిని కొట్టేసింది. బంగారు నగలు తుప్పుపట్టిపోతాయని, విలువ తగ్గుతుందన్న గాలి అభ్యర్థనను తిరస్కరించింది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే వాటిపై హక్కులు తేల్చుకోవాలని స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్ ద్వారా రూ.884.13 కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారని సీబీఐ కేసు నమోదుచేసి, నేరపూరిత సొమ్ముతో కొన్న నగలపై ఈడీ కూడా హక్కులు కోరుతోందని, అందువల్ల ఈ దశలో సీజ్ చేసిన వాటిని అప్పగించాలని ఉత్తర్వులు ఇవ్వలేమంది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే నగలను, సొమ్మును తీసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చంది.

# రైలు హైజాక్ ఉగ్రవాదలు వెనక భారత్ హస్తం

న్యూఢిల్లీ, బలోచిస్థాన్ రైలు హైజాకింగ్‌లో భారత్ పాత్ర ఉండొచ్చంటూ పాక్ విదేశాంగ శాఖ చేసిన ఆరోపణలపై భారత్ ఘాటుగా స్పందించింది. తన సమస్యలకు పొరుగువారిని బాధ్యుల్ని చేసే ప్రయత్నం మానుకోవాలని మండిపడింది. 'పాక్ చేసిన నిరాధార ఆరోపణలను మేము తిరస్కరిస్తున్నాము. ప్రపంచంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మూలం ఎక్కడుందో ప్రపంచానికి అంతటికీ తెలుసని హెచ్చరించింది. ఎదుటి వారిపై నెపం నెట్టి బాధ్యుల్ని చేసే బదులు పాక్ ఆత్మపరిశీలన చేసుకోవాలని భారత్ ఘాటుగానే స్పందించింది. తన అంతర్గత సమస్యలకు, వైఫల్యాలకు ఇతరులు కారణమని అనడం మానుకోవాలని విదేశాంగ శాఖ రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. హైజాకింగ్ ఘటనపై పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పందించారు. రైలును హైజాక్ చేసిన వేర్పాటువాదులు ఆఫ్ఘనిస్థాన్‌లోని తమ లీడర్లతో టచ్‌లో ఉన్నారని అన్నారు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలను ఆఫ్ఘాన్ భూభాగంలో అనుమతించరాదని అక్కడి వారికి తాము గతంలో అనేకసార్లు స్పష్టం చేసినట్టు కూడా పేర్కొన్నారు. ఈ ఘటనలో పాలు పంచుకున్న పాత్రధారులు సూత్ర దారులు అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా తమకు సహకరించాలని ఆఫ్ఘాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విలేకరులు భారత్ ప్రస్తావన తెచ్చారు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలకు గతంలో భారత్‌ను నిందించే పాక్ విధానంలో ఏమైనా మార్పు వచ్చిందా అని అన్నారు. దీనిపై పాక్ ప్రతినిధి స్పందిస్తూ తమ విధానంలో మార్పు ఏమీ లేదని అన్నారు. 'వాస్తవాల్లో మార్పు ఏమీ లేదు. పాక్‌పై ఉగ్రవాదం ఎగదోయడం వెనక భారత్ ఉంది. ఈ ఘటనలో మాత్రం కాల్ డాటా ఆఫ్ఘానిస్థాన్ పాత్ర సూచిస్తోంది. మేము అది మాత్రమే అన్నాము' అని అన్నారు. పొరుగు దేశాలను అస్థిరపరిచి ప్రపంచవ్యాప్తంగా హత్యలను భారత్ ప్రేరేపించే ప్రయత్నం చేస్తోందని కూడా అన్నారు. భారత మీడియా కూడా బలోచ్ చర్యలను పొగుడుతూ కథనాలు ప్రచురిస్తోందని, ఇది భారత విధానాలకు అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. దీంతో, భారత్ పాక్ తీరును ఎండగడుతూ గట్టి రిప్లై ఇచ్చింది. అయితే, రైలును తమ ఆధీనంలోకి తీసుకున్నామని ఇటీవల పాక్ ఆర్మీ పేర్కొంది. ఆపరేషన్ ముగిసినట్టు వెల్లడించింది. అయితే, బలోచ్ ఆర్మీ మాత్రం ఈ ప్రకటనను తోసి పుచ్చింది. బలోచిస్థాన్‌లో జరిగిన రైలు హైజాక్ ఘటనపై పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి షఫ్ఖత్ అలీఖాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. భారత్ తమ దేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. పొరుగుదేశాల్లో అస్థిరత నెలకొల్పేందుకు ప్రయత్నిస్తూ, ప్రపంచవ్యాప్తంగా హత్యాకాండకు పాల్పడుతోందని అన్నారు. సుమారు 425 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు 33 మందినీ హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. రైలు హైజాక్ వెనక అఫ్గానిస్థాన్ హస్తం ఉందనేందుకు తమవద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపై అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. పాక్ చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. పాక్ బాధ్యతారహిత వ్యాఖ్యలు వారి దిగజారుడు విధానాలకు నిదర్శనమని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోలేని పాక్ ఇతర దేశాలపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికింది.

# కారెక్కడం ఖాయమా?

హైదరాబాద్,వాళ్ల టోన్ మారుతోంది. గులాబీ పార్టీ పట్ల సాఫ్ట్ కార్నర్ కనిపిస్తోంది. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్ గూటికి చేరిన ఎమ్మెల్యేలు..అప్పుడప్పుడు డిఫరెంట్ మ్యూజిక్ ప్లే చేస్తున్నారు. కొందరు కేసీఆర్ గ్రేట్ అంటుంటే..మరికొందరు అసలు తాము కాంగ్రెస్‌లో చేరలేదంటున్నారు. ఇంకొందరు అయితే ఓపెన్‌గానే రేవంత్ ప్రభుత్వ విధానాలను తప్పుబడుతున్నారు. అనర్హత గుబులతో పాటు..కాంగ్రెస్‌లో ఇమడలేక గులాబీ బాస్‌తో టచ్‌లోకి వెళ్తున్నారట. ఆ ఎమ్మెల్యేలు బ్యాక్ టు పెవిలియన్ అంటున్నారా? కాంగ్రెస్ పార్టీకి గులాబీ దళపతి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వబోతున్నా రా.?తెలంగాణ పాలిటిక్స్‌లో ఆసక్తికర ఇన్సిడెంట్స్ చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ ఆఫీసులో ఉన్న గులాబీ బాస్ కేసీఆర్‌ను..పటాన్‌చెర్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలిశారు. తన తమ్ముడి పెళ్లికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అయితే ఇన్విటేషన్ కార్డు ఇచ్చేందుకే కలిసినా గూడెం తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది.కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన గూడెం మహిపాల్‌రెడ్డికి పటాన్‌చెరులో పరిస్థితులు అంతగా అనుకూలించడం లేదట. లోకల్ కాంగ్రెస్ లీడర్లను గూడెం అసలు పట్టించుకోవడం లేదట. కాంగ్రెస్ పార్టీ విధానాలపై ఆయన అసంతృప్తిగా ఉన్నారన్న చర్చ జరుగుతోంది.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ ఫోటో పెట్టుకోలేదని లోకల్ కాంగ్రెస్ లీడర్లు ఆ మధ్య రచ్చ చేశారు. ఇంకా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోటోనే ఉందని హంగామా సృష్టించారు. గూడెం మాత్రం బరాబర్ కేసీఆర్ ఫోటో పెట్టుకుంటా అంటూ స్టేట్ మెంట్ ఇచ్చేశారు. అంతేకాదు వివాహాలు, విందు కార్యక్రమాలకు వెళ్ళినప్పుడు పిచ్చాపాటిగా గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు హాట్ టాపిక్ అవుతున్నాయి.

త్వరలోనే కారు ఎక్కనున్న గూడెం?

ఏదో కాంగ్రెస్‌లో చేరాను కానీ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని అంటున్నారట గూడెం. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ తీసుకొనే కార్యక్రమాలకు ఆయన డుమ్మా కొడుతున్నారు. కాంగ్రెస్ ఓ పార్టీనా అంటూ గూడెం చేసిన కామెంట్స్ కూడా దుమారం లేపుతున్నాయి. ఇలా ఆయన మనసు బీఆర్ఎస్ వైపు లాగుతోందన్న చర్చ జరుగుతోంది. త్వరలోనే గూడెం మహిపాల్‌రెడ్డి తిరిగి కారు ఎక్కుతారని అంటున్నారు.ఆయనే కాదు మరొకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తిగా ఉన్నారట. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అయితే.. ఏకంగా తాను కాంగ్రెస్‌లో చేరలేదంటూ పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. ఆ మధ్య అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కనిపించారు. దీంతో కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారన్న ప్రచారం జరిగింది. ఆయనకు లోకల్‌గా జడ్పీ ఛైర్మన్ సరిత తిరుపతయ్యతో పొసగడం లేదట.

కనీసం అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం లేదని బండ్ల అసహనం..

మొన్నటి ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు సరిత. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడంతో ఇద్దరి మధ్య ఉప్పు నిప్పుగా ఉందట వ్యవహారం. సేమ్ టైమ్ సుప్రీంకోర్టులో ఉన్న అనర్హత కేసు కూడా భయపెడుతోందట. కాంగ్రెస్ పెద్దల తీరుపై ఆయన అసంతృప్తిగా ఉన్నారట. చేరే వరకు ఎన్నో హామీలిచ్చి..ఇప్పుడు కనీసం అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారట. దాంతో కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుతారన్న ప్రచారం జరుగుతోంది.మరో ఎమ్మెల్యే దానం నాగేందర్..ఆ పది మందిలో అందరి కంటే ముందే కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి కంటెస్ట్ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన రేవంత్ సర్కార్‌పై అసంతృప్తి రాగం వినిపిస్తున్నారు.

# పాక్ మసీదులో పేలుడు..పలువురికి గాయాలు

ఇస్లామాబాద్, బలోచిస్థాన్‌లో బీఎల్ఏ ఉగ్రవాదులు రైలు హైజాక్ చేసి పదుల సంఖ్యలో ప్రయాణికులను ఊచకోత కోసిన ఘటన ఇంకా సద్దుమణగక ముందే పాకిస్థాన్‌లో రంజాన్ పండుగ వేళ మరో దుశ్చర్య చోటుచేసుకుంది. ఖైబర్ ఫఖ్తుంక్వా ప్రావిన్స్‌లోని సౌత్ వజరిస్థాన్ మసీదులో శుక్రవారం ప్రార్థనల సందర్భంగా మధ్యాహ్నంపేలుడు చోటుచేసుకుంది. ఈ పేలుడులో చిన్నపిల్లలతో సహా నలుగురు గాయపడ్డారు. రాజకీయ పార్టీ జమాయిత్ ఉలేమా ఇస్లామ్ నేత అబ్దుల్లా నదీమ్‌ను టార్గెట్‌గా చేసుకుని ఈ పేలుడుకు అగంతకులు పాల్పడినట్టు అధికారులు చెబుతున్నారు. పేలుడు ఘటనలో అబ్దుల్లా నదీప్ తీవ్రంగా గాయపడటంతో అతన్ని, ఇతర క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, ఈ ఘటనకు తామే బాధ్యులమని ఇంతవరకూ ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటించలేదు.గత నెలలో నౌషెరా జిల్లాలోని దారుల్ ఉలూమ్ హఖ్కాని సెమినరీ జరుగుతుండగా ఆత్మహుతి దాడి జరిగింది. ఈ దాడిలో జేయూఐ-ఎస్ నేత మౌలానా హమిదుల్ హఖ్ హుఖ్కాని సహా ఆరుగురు మరణించగా, 15 మంది గాయపడ్డారు. దీనికి ముందు 2023 జనవరి 30న పెషావర్ పోలీస్ లైన్స్ ఏరియాలో జరిగిన బాంబు పేలుడులో 59 మంది మృతి చెందగా, 157 మంది గాయపడ్డారు.

# ఎవరికి ఇబ్బందికరంగా మారింది?

హైదరాబాద్,ఆమె ఎంట్రీ.. ఆ జిల్లా నేతలకు ఇష్టం లేదట. ఇప్పటికే మంత్రిగా ఉన్న నేతకు ఆ మహిళా నేత అంటే గిట్టదట. ఇంకో సీనియర్ నేత..ఆ లేడీ ఫైర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందట. ఇలాంటి టైమ్‌లో మేడమ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చింది హస్తం పార్టీ. పైగా ఆమెను మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న టాక్ వినిపిస్తోంది. దీంతో ఆ జిల్లా హస్తం పార్టీలో కొత్త రచ్చ స్టార్ట్ అయిందట. ఇంతకీ ఆ మహిళా నేత రాక ఎవరికి ఇబ్బందికరంగా మారింది? ఏ లీడర్‌కు చెక్ పెట్టేందుకు ఆమెను తీసుకొచ్చారు?తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీల ఎంపిక కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా పరిస్థితి మారిందట. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎంపికలో అధిష్టానం ఒకటి తలిస్తే..జరుగుతున్నది మాత్రం మరొకటి అన్నట్లుగా ఉందట. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాస్త బలహీనంగా కాంగ్రెస్ పార్టీని స్ట్రెంథెన్ చేసేందుకు విజయశాంతికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందట కాంగ్రెస్ పార్టీ.గత అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు ఏడు స్థానాలు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పర్ఫామెన్స్ చాలా వీక్‌గా అనిపించిందట. దీంతో అక్కడ పార్టీని బలోపేతం చేయడం కోసమే..గతంలో మెదక్ ఎంపీగా పనిచేసిన విజయశాంతిని శాసనమండలికి సెలెక్ట్ చేశారట కాంగ్రెస్ పెద్దలు.ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ బలోపేతం కోసం విజయశాంతిని ఎమ్మెల్సీగా సెలెక్ట్ చేస్తే..అక్కడ పార్టీ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారిందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే మెదక్ జిల్లాలోని పటాన్‌చెరు నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు పీక్ లెవల్‌కు చేరాయి. ఇక ఇప్పుడు విజయశాంతి ఎంట్రీతో కొత్త గ్రూపు ఫామ్ అయ్యిందనే చర్చ జరుగుతోంది.

జగ్గారెడ్డి, విజయశాంతి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందనే టాక్.. ఎమ్మెల్సీగా విజయశాంతి పేరు ప్రకటన వెలువడగానే మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా చూసి షాక్ కు గురయ్యానని కామెంట్స్ చేశారు. అయితే విజయశాంతి అంటే ఉమ్మడి మెదక్ జిల్లాలోని సీనియర్లకు ఏమాత్రం గిట్టదట. మంత్రి దామోదర రాజనర్సింహాకు విజయశాంతికి మధ్య ఏమాత్రం పొసగదట. ఇక జగ్గారెడ్డి, విజయశాంతి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందనే టాక్ ఉంది.ఎమ్మెల్సీగా విజయశాంతి ఎంపికే చర్చకు దారితీస్తుంటే..మరో ప్రచారం ఆసక్తి రేపుతోంది. త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో విజయశాంతికి ఛాన్స్ ఉంటుందనే టాక్ నడుస్తోంది. ఇదే గనుక జరిగితే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేలా ఉందట. ఉమ్మడి మెదక్ జిల్లాలో సీనియర్ నేత దామోదర రాజనర్సింహకు.. విజయశాంతికి మధ్య గ్యాప్ ఉందట.

రాములమ్మ మంత్రి అయితే రాజనర్సింహ పరిస్థితి ఏంటి?

ఇక విజయశాంతికి మంత్రిగా అవకాశం ఇస్తే.. దామోదర రాజనర్సింహ హవా తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట. విజయశాంతి కేంద్రంగా కొత్త గ్రూప్ ఏర్పడి మరింత రచ్చ జరిగే అవకాశం లేకపోలేదనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఒకటి తలిచి రాములమ్మకు అవకాశం ఇస్తే.. భవిష్యత్‌లో జరిగేది మాత్రం అందుకు భిన్నంగా ఉండబోతుందట.మాజీ సీఎం కేసీఆర్ సొంత జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయోగం.. బూమరాంగ్ అవుతోందన్న టాక్ వినిపిస్తోంది. రాములమ్మ రాకతో మెదక్ జిల్లా కాంగ్రెస్‌లో ఎలాంటి మార్పులు రాబోతున్నాయో చూడాలి మరి.

# జన్మతఃపౌరసత్వం రద్దు వ్యవహారం

వాషింగ్టన్, జన్మతః పౌరసత్వం రద్దుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుదలగా ఉన్నారు. తాజాగా తన ఆదేశాలను ఫెడరల్ కోర్టులు నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. యాక్టింగ్ సొలిసిటర్ జనరల్ సారా హారిస్ ఈ పిటిషన్ సాధారణమైనదని అభివర్ణించారు. మూడు దిగువ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లను వ్యక్తిగత స్థాయికే పరిమితం చేయాలని ఆమె న్యాయస్థానాన్ని కోరారు. అంతేగాక, ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యంగబద్ధమా..?కాదా..?అన్న విషయంపై అభిప్రాయాన్ని మాత్రం కోరలేదు. ట్రంప్ జారీ చేసిన ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నాయి. మేరీల్యాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్ రాష్ట్రాల్లో పిటిషన్లు దాఖలు కావడంతో కోర్టులు ఇంజెక్షన్ ఆర్డర్లు జారీ చేశాయి. ఈ ఆదేశాలు దేశ ఎగ్జిక్యూటివ్ విభాగాన్ని రాజ్యంగపరమైన విధులు నిర్వహించకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఇటీవల ట్రంప్ సర్కారు తొలగించిన పలువురు ప్రొబేషనరీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఆరు ఏజెన్సీలకు కాలిఫోర్నియాలో న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా చట్టాల ప్రకారం.. ఆ దేశ పౌరులకు పుట్టినవారికి మాత్రమే కాకుండా.. అమెరికాలో జన్మించిన ప్రతిఒక్కరికీ అక్కడి పౌరసత్వం లభిస్తుంది. అమెరికా గడ్డపై పుట్టినవారంతా ఈ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఇప్పటివరకు ఈ పక్రియ నిరంతరాయంగా కొనసాగింది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి బ్రేక్ పడింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ.. తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా అదే నియమం వర్తిస్తుంది. 2024 చివరినాటికి 5.4 మిలియన్ల మంది ప్రవాస భారతీయులు అక్కడ నివసిస్తున్నారు.

# ఆశ అడియాస.. ఏంటానాయకుడి వ్యథాభరిత గాథ....

హైదరాబాద్,ఎమ్మెల్సీ పదవి వస్తుందని. ఆపై మంత్రి కూడా అయిపోతానని కలలుగన్నారు. కానీ లాస్ట్ మినిట్స్ లో ఊహించని ట్విస్ట్. క్లయిమ్యాక్స్ లో టోటల్ సీన్ రివర్స్. దీంతో సోషల్ మీడియాలో ఒకటే పోస్టులు. ఈ పోస్టుల టార్గెట్.. నేషనల్ లెవల్ కి తమ అభిమాన నేత.. ఆవేదన చేరడం. ఇంతకీ ఎవరీ నాయకుడు? ఏంటాయన వ్యథాభరిత గాథ.

కామారెడ్డి నుంచి పోటీ చేయాలనుకున్న షబ్బీర్

మరోమారు ఆలోచించమని కోరుతున్న అలీ అనుచరవర్గంషబ్బీర్ అలీ. పరిచయం అక్కర్లేని సీనియర్ కాంగ్రెస్ నేత. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి పోటీ చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుత సీఎం రేవంత్ సైతం అక్కడి నుంచి పోటీ చేయాలనుకోవడంతో.. లోకేషన్ ఛేంజ్ చేశారు. లాస్ట్ బట్ బెస్ట్ అనిపించడం లో భాగంగా.. నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేశారు. కానీ బై బ్యాడ్ లక్ స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. పార్టీ గెలిచి తాను ఓడ్డంతో తీవ్ర అసంతృప్తి. ఏం చేద్దాం.. దురదృష్టం అలా వెంటాడిందని తనకు తాను బాధ ఓదార్చుకున్నారు. తన ఆశలన్నీ.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఛాన్స్ కి షిఫ్ట్ చేసుకున్నారు.

ఎమ్మెల్సీ ఛాన్స్ దక్కక పోవడంతో తీవ్ర నిరుత్సాహం

ఒకటీ రెండు కాదు ఏకంగా 45 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్నారు షబ్బీర్ అలీ. దానికి తోడు పార్టీ మైనార్టీల్లోనే దిగ్గజ నేతగానూ ఒక బ్రాండ్ ఉంది. దీంతో.. పార్టీ సైతం ఆయనకు ముఖ్య సలహాదారు పోస్టునిచ్చి గౌరవించింది. తగిన విధంగానే సత్కరించింది. అయినా సరే ఆయనకు ఏమంత సంతృప్తి కలగలేదట. ఎలాగైనా సరే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యి .. అధ్యక్షా అనాలనుకున్నారట. ఎంతైనా.. సభలో ఉంటే ఆ పవరే వేరు కాబట్టి.. ఆ దిశగా ఇన్నాళ్ల పాటు తన ఆశలు పెంచుకుంటూ వచ్చారట. అయితే తన ఆశలన్నీ నిరాశలుగా మారడంతో తీవ్ర నిరుత్సాహ పడుతున్నారట షబ్బీర్ అలీ, ఆయన అనుచరులు.

షబ్బీర్ అలీ ద్వారా తీరుతుందని భావస్తే.. ఆశ అడియాశ

కాంగ్రెస్ కి పూర్వ వైభవం వచ్చింది. కానీ తమకు రాలేదు. ఒక్కటంటే ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదు. అంతగా వివక్ష చూపుతున్నారు. ఇదీ ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ శ్రేణుల అభిప్రాయమట. ఈ ముచ్చట షబ్బీర్ అలీ ద్వారా తీరుతుందని ఆశపడ్డవారికి తీవ్ర భంగపాటు తప్పలేదట. ఇదే అంశంపై షబ్బీర్ అలీ అనుచర వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోందట. సోషల్ మీడియా గోడలపై.. పోస్టుల మీద పోస్టులు పెడుతోందట.

సీనియర్ షబ్బీర్ కి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్న చర్చ

షబ్బీర్ అలీది కాంగ్రెస్ లో సుదీర్ఘ ప్రస్తానం. దాదాపు అర్ధశతాబ్ద కాలం నుంచీ ఆయన కాంగ్రెస్ పార్టీ వీర విధేయులు. అంకిత భావం గల నేతగానూ పేరు. తెలంగాణ శాసన మండలిలో ఇటు ప్రతిపక్ష నేతగా.. అటు పార్టీలోనూ పలు హోదాల్లో పని చేసిన అనుభవజ్ఞులుగానూ ప్రఖ్యాతులు. అలాంటి నేతకు తగిన ప్రాధాన్యతనివ్వలేదని అనుచర వర్గాలు పార్టీలో చర్చకు తెరలేపాయట. ఇటు పార్టీకే కాకుండా అటు మైనార్టీ సమాజానికి అలీ చేసిన సేవలు మరువలేనివనీ.. మైనార్టీ సంక్షేమం కోసం ఆయన న్యాయవాదిగానూ పని చేశారనీ తమ వాదన వినిపిస్తున్నారట. మైనార్టీ వర్గాల ప్రయోజనాలను కాపాడ్డంలో అవిశ్రాంత కృషి చేసిన అలీకి.. ఇంతటి ద్రోహం జరగటంతో.. తాము తట్టుకోలేక పోతున్నామనీ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారట. ఏది ఏమైనప్పటికీ.. తమ అభిమాన నేత- అలీకి తీరని అన్యాయం జరిగిందని



మాట్లాడుకుంటున్నారట.

అధిష్టానం ఆదేశం మేరకే అడ్వయిజర్ గా కొనసాగుతున్నా- అలీ

ఇదే అంశంపై మాజీ మంత్రి, ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సైతం స్పందించారు. అడ్వైజర్ గా కొనసాగడం తనకు ఇష్టం లేకున్నాసరే, పార్టీ అధిష్టానం తీస్కున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నాననీ వాపోయారట. తన టార్గెట్ ఎమ్మెల్సీ ఆపై మంత్రి పదవి పొందడమనీ అంటున్నారట. ఈ దిశగా.. తను, తన వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నామనీ చెబుతున్నారట. తన వారి ముందు ఈ దిశగా తన బాధ వ్యక్తం చేస్తున్నారట సీనియర్ లీడర్ షబ్బీర్ అలీ. అప్పట్లో తాను రేవంత్ కోసం కామరారెడ్డి సీటు త్యాగం చేయకపోయి ఉంటే.. ఈ పాటికి నేరుగా ఎమ్మెల్యేగా గెలిచి.. ఆపై మైనార్టీ కోటాలో మంత్రి పదవి సాధించి ఉండేవాడిననీ అంటున్నారట. పార్టీ కోసం ఆ మాత్రం త్యాగం చేయడంలో తప్పులేదని భావించడమే తనకీ దుస్థితి తెచ్చిపెట్టిందని తన వారి ముందు తన ఆవేదన వ్యక్తం చేస్తున్నారట.

ఇప్పుడు ఎమ్మెల్సీ లేదంటే.. వచ్చే మంత్రి వర్గ విస్తరణ ఛాన్సూ లేనట్టే..

తాజా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో అలీ పేరు లేక పోవడంతో.. వచ్చే మంత్రి వర్గ విస్తరణకు ఛాన్సే లేదు కాబట్టి.. షబ్బీర్ అలీ, ఆయన అచనురులు భగభగలాడి పోతున్నారట. దీంతో తమదైన స్టైల్లో సోషల్ మీడియా పోస్టులు పెట్టి తమ మంట చల్లార్చుకుంటున్నారట. తమ ఆక్రోశం, ఆవేదన.. సీదా జాతీయ నాయకత్వం దృష్టికి తీస్కెళ్లే యత్నం చేస్తున్నారట. ఇలాగైనా సరే, తమ లీడర్ షబ్బీర్ అలీకి తగిన న్యాయం చేయాలని కోరుకుంటున్నారట.

గతంలో అసెంబ్లీ సీటు పొందిన, నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారికి నో ఛాన్స్

అయితే పార్టీ అంతర్గత వర్గాల సమాచారం మేరకు తేలిందేంటంటే.. గత ఎన్నికల్లో అసెంబ్లీ సీటు ఇచ్చిన వారికి %చీూ% ఎమ్మెల్సీ ఛాన్స్. ఆపై గెలిచాక నామినేటెడ్ పోస్టులు పొందిన వారికీ.. ఈసారి మండలి అవకాశాలివ్వరాదని డిసైడ్. ఆల్రెడీ అధిష్టానం ఈ దిశగా ఫిక్స్ అయ్యింది కాబట్టే.. అలీకి ఛాన్సు మిస్సయిందనీ గాంధీ భవన్ వర్గాల ఇంటర్నల్ టాక్.

మరోమారు ఆలోచించమని కోరుతున్న అలీ అనుచరవర్గం

అయితే ఇలాంటివేవీ .. అలీ వర్గీయుల మనసుల్కైన గాయాలను మాన్పలేక పోతున్నాయట. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ఇటు ఉమ్మడి జిల్లాకు ఇంత వరకూ మంత్రిమండలిలో.. దక్కని ప్రాతినిథ్యం. ఆటు మైనార్టీ కోటాకు రాని మంత్రిత్వం.. ఇక సీనియారిటీకి దక్కని గౌరవం వంటి ప్రాధాన్యతాంశాలను పరిగణలోకి తీసుకుని.. మరోమారు ఆలోచించమని కోరుతున్నారట. మరి చూడాలి. షబ్బీర్ వర్గీయుల ఆవేదనకు అధిష్టానం నుంచి ఎలాంటి సమాధానం వస్తుందో వేచి చూడాల్సిందేనంటున్నారు.. హస్తం పార్టీ కార్యకర్తలు.

# ఎంఎస్‌యుడిని నివారించే జన్యుథెరపీ



మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ (ఎంఎస్‌యుడి) అనేది బలహీనపరిచే, వారసత్వంగా వచ్చే అరుదైన జన్యుపరమైన రుగ్మత. ఇది శరీరంలోని అమినో ఆమ్లాలను సరిగ్గా విచ్ఛిన్నం చేయలేని పరిస్థితికి దారితీస్తుంది. అందువల్ల అమినో ఆమ్లాలు మూత్రంలో పేరుకుపోయి విషపూరితంగా మారుతాయి. ఈ పరిస్థితిని వెంటనే గుర్తించి వైద్య చికిత్స అందించగలిగితే ఫరవాలేదు. లేకుంటే కాలేయ మార్పిడి వరకు దారి తీయడమే కాదు, ప్రాణాంతకం కూడా కావచ్చు. ఈ జన్యుపరమైన రుగ్మత నివారణకు జన్యుపరమైన చికిత్సను శాస్త్రవేత్తలు కనుగొనగలిగారు. ఈ విధమైన రుగ్మతతో జన్మించిన ఆవుదూడలో ప్రయోగాత్మకంగా జన్యుపరమైన చికిత్స చేసి ప్రాణాంతక లక్షణాలు పునరావృతం కాకుండా కాపాడగలిగారు. పాలు, మాంసం, గుడ్లు వంటి ప్రొటీన్లు అత్యధికంగా ఉండే ఆహారాల్లో ఇవిల్యూసిన్, ఐసోలూసిన్, వాలైన్ వంటి అమినో ఆమ్లాలను విచ్ఛిన్నం చేయడానికి బిసికెడిహెచ్ కాంప్లెక్స్ ఎంజైములు అవసరం. ఈ ఎంజైములు శరీరంలో తయారయ్యేలా బిసికెడిహెచ్ఎ, బిసికెడిహెచ్‌బి లేదా డిబిటి అనే మూడు జన్యువులు సంకేతాలు అందిస్తుంటాయి. అలాంటి ఈ మూడు జన్యువుల్లో ఉత్పరివర్తనాలు సంభవిస్తే ఎంజైముల కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా అమినో ఆమ్లాలను సరిగ్గా విచ్ఛిన్నం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల అమినో ఆమ్లాలు మూత్రంలో పేరుకుపోయి విషపూరితంగా మారుతుంటాయి. ఈ విధమైన రుగ్మత వారసత్వంగా సంక్రమించే అవకాశం ఉంటుంది. ఈ రుగ్మతనే మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ (ఎంఎస్‌యుడి) అని అంటారు. ఇప్పుడు శాస్త్రవేత్తలు కనుగొన్న జన్యుపరమైన చికిత్స రెండు రకాల క్లాసిక్ మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ రోగులకు ముున్ముందు ఆదుకునే అవసరం కలుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యాధికి పరిమితమైన చికిత్స అవకాశాలు ఉంటున్నాయి. బ్రాంచ్డ్ చైన్ ఆల్ఫాకీటో యాసిడ్ డీహైడ్రోజినేస్ కాంప్లెక్స్ ప్రొటీన్ సబ్‌యూనిట్‌లను క్రోడీకరించే మూడు జన్యువుల్లోని ఉత్పరివర్తనాల నుంచి క్లాసిక్ మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ పుడుతుంది. ఈ వ్యాధి లక్షణాలున్న వారికి తక్కువ ప్రొటీన్లు కలిగిన ఆహారం ఇస్తుంటారు. చివరికి నాడీ సంబంధిత రుగ్మతలు, మెదడు దెబ్బతినే ప్రాణాంతకమైన పరిస్థితులు ఏర్పడతాయి. రెండు రకాల క్లాసిక్ ఎంఎస్‌యుడి వ్యాధికి కొత్త జన్యు చికిత్స ప్రత్యామ్నాయం అవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూనివర్శిటీ ఆఫ్ మాసాచుసెట్స్ చాన్ మెడికల్ స్కూల్‌కు చెందిన డాక్టర్ జియామింగ్ వాంగ్ బృందం ఈ కొత్త జన్యుపరమైన చికిత్సపై ప్రయోగాలు చేశారు. అడినో అసోసియేటెడ్ వైరస్ వెక్టర్స్‌ను ఉపయోగించి బిసికెడిహెచ్ఎ, బిసికెడిహెచ్‌బి అనే క్రియాత్మకమైన జన్యుకాపీలు రూపొందించగలిగారు. జన్యు చికిత్స ప్రకారం ఎలుకలోని ప్రాణాంతక కణాలను తొలగించి మేలు చేకూర్చే కణాలను చేర్చగలిగారు. బిసికెడిహెచ్ఎ, లేదా బిసికెడిహెచ్‌బి అనే నిర్దిష్ట జన్యువు లోపంతో జన్మించిన ఎలుకలో ప్రత్యామ్నాయ జన్యువును చేర్చి ఎలుకకు ప్రాణగండం తప్పించగలిగారు. ఒక వ్యవసాయ క్షేత్రంలో క్లాసిక్ ఎమ్ఎస్‌యుడితో కొన్ని కొత్త ఆవుదూడలు చనిపోతుండడాన్ని గమనించగలిగారు. తమ జన్యుచికిత్స విధానం కింద సింగిల్ డోస్‌తో బొవిన్ జీనోమ్ ప్రకారం జన్యుక్రమబద్ధీకరణ చేయగలిగారు. ఈ ప్రక్రియతో రెండేళ్ల తరువాత ఆ ఆవుదూడ బాగా వృద్ధి చెందింది. ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోగలిగింది. ఎంఎస్‌యుడి అనేది వారసత్వంగా సంక్రమిస్తుంది. తల్లిదండ్రుల్లో పరివర్తన చెందిన జన్యువులు ఉంటే ఎంఎస్‌యుడి లక్షణాలున్న బిడ్డలు పుడతారు. ఇలాంటి లక్షణాలున్న శిశువులు పుట్టిన కొన్ని రోజుల్లోనే ఈ వ్యాధి లక్షణాలు బయటపడుతాయి. ప్రపంచ వ్యాప్తంగా 185000 జననాల్లో ఒకరికి ఎమ్ఎస్‌యుడి వస్తుందని అంచనా. సాధారణ జనాభాతో పోలిస్తే మెన్నోనైట్ జనాభాలో ఎంఎస్‌యుడి ఎక్కువగా కనిపిస్తుంది. పాత ఆర్డర్ మెన్నోనైట్ జనాభాలో 380 మందిలో ఒకరికి కనిపించింది అష్కనాజీ యూదు జనాభాలో 26,000 మందిలో ఒకరికి ఎంఎస్‌యుడి వస్తుందని భావిస్తున్నారు. అమెరికాలో దాదాపు 2000 మంది ఎంఎస్‌యుడితో బాధపడుతున్నారు. ఎంఎస్‌యుడి ఉన్న చాలా మంది నవజాత శిశువుల్లో మొదట్లో స్క్రీనింగ్, రక్తం, మూత్రం, పరీక్షలు, ఇఎస్ఐ వంటి పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తిస్తారు.

# మంగళగిరి రూపురేఖలు మారుస్తా

గుంటూరు, ఎన్నికల్లో భారీ మెజారిటీతో తనను గెలిపించిన మంగళగిరి వాసులకు జీవితాంతం గుర్తుండిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలను రానున్న వంద రోజుల్లో ప్రారంభిస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. భూగర్భ డ్రైనేజీ, నడుమూరు ఫ్లై ఓవర్ పనులు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. ఎర్రబాలెంలో జైనుల ఆధ్వర్యంలో నిర్మించిన భగవాన్ మహవీర్ గోశాలను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. హోలీ సందర్భంగా చిన్నారులకు లోకేశ్ రంగులు పూశారు. అనంతరం రమేశ్ జైన్ ఆధ్వర్యంలో నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్‌ను మార్వాడీలు ఘనంగా సన్మానించారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరి అభివృద్ధి పనులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న వంద రోజుల్లో మంగళగిరి ప్రజలు ఊహించని రేంజ్ లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. రహదారులు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారు. మంగళగిరి ప్రజల రుణం తీర్చుకుంటానని.. రాబోయే ఐదేళ్లలో మంగళగిరి రూపు రేఖలు మారుస్తానని తెలిపారు. మంగళగిరి ప్రజల రుణం తీర్చుకునే బాధ్యత తన మీద ఉందన్నారు. గత ప్రభుత్వం మంగళగిరిని పట్టించుకోకుండా అన్యాయం చేసిందన్నారు.

# అక్రమాలపై విచారణకు ఆదేశించాం

అమరావతి, వర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అక్రమాలపై అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో చర్చ జరిగింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని తెదేపా, భాజపా, జనసేన ఎమ్మెల్యేలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై తెదేపా ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడారు. అనంతరం మంత్రి లోకేశ్ వారికి సమాధానమిచ్చారు. ఏయూలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. ఇన్‌ఛార్జ్ వీసీ ఇప్పటికే విచారణకు ఆదేశించారన్నారు. ఆ విచారణ నివేదిక రాగానే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు అవుతున్నా ఇంకా ఉపేక్షించడం తగదన్నారు. నిర్దిష్ట కాలపరిమితితో విచారణను వేగవంతం చేయాలని ఆయన కోరారు. మరో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. గతంలో వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి వైకాపా అధ్యక్షుడి తరహాలో వ్యవహరించారని ఆరోపించారు. ఎంతో పేరున్న ఏయూను రాజకీయ వేదికలా ఆయన మార్చారని ఆక్షేపించారు. ఇతర వర్సిటీల ప్రక్షాళన కూడా జరగాలని జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఆంధ్రా యూనివర్సిటీ అంటే అందరికీ ఒక సెంటిమెంటుతో కూడుకున్నదని, బ్యాంక్ ఆఫ్ అమెరికా ఛైర్మన్, జిఎమ్మార్ అధినేత ఏయూలో చదువుకుని వచ్చిన వారేనని, ఏయూ ప్రపంచంలోనే టాప్ 100లో ఉండాలని సిఎం చంద్రబాబు (అఓ అరజీనిటసజీశిజీశిబీ) భావించారని విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ (ఓతినితిబ।స ఔజీసజీ ఒనీ।బర) అన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తర సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఏయూ టాప్‌లో ఉండాలనే ఉద్దేశంతో ఐఐటి కరఖ్ పూర్ ప్రొఫెసర్ రాజశేఖర్‌ను ఏయూ వీసీగా నియమించామన్నారు. మాజీ సిఎం జగన్ విశాఖపట్నం వస్తే పిల్లలను రోడ్డుపైకి తెచ్చి స్వాగతం పలికించుకునేవారని, రూసా గ్రాంట్స్, ఇస్రో గ్రాంట్‌ను దుర్వినియోగం చేశారని మంత్రి లోకేష్ విమర్శించారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డి రూలింగ్ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేశారని అన్నారు. దీనిపై ఇన్చార్జి వీసీ ఒక కమిటీని నియమించారని తెలిపారు. విజిలెన్స్ అకౌంట్ కూడా వేశామన్నారు. సభ డిమాండ్ మేరకు కమిటీ విచారణ జరిపి 60 రోజుల్లో రిపోర్టు ఇవ్వాలని మంత్రి లోకేష్ కమిటీని ఆదేశించారు. ఇంకోసారి పొరపాటు చేయాలంటే బయపడేటట్టు చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రమాణాలను పెంచి గతవైభవం తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఏయూ మాజీ వీసీ ప్రసాద్ రెడ్డిపై ఉన్న ఆరోపణల విషయంలో ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఫండ్స్ డైవర్సన్, అక్రమ నియామకాలతో ఏయూను రాజకీయ కార్యాలయంగా ఎలా మార్చారో అందరికి తెలుసునని అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ 1926లో స్థాపించబడిందని, తాను కూడా యూనివర్సిటీ పూర్వవిద్యార్థినని చెప్పారు. సెనెట్ హాలులో రాజకీయ నాయకుల పుట్టిన రోజు పార్టీలు చేశారని, అడ్మినిస్ట్రేషన్ మ్యాన్యువల్లో ఉన్నట్లు ఆయన ఫాలో అవ్వలేదని, ఇష్టానుసారం అపాయింట్మెంట్ ఇచ్చారని శ్రీనివాసరావు అన్నారు. అతనిని ప్రైవేటు కాలేజీల నుండి తెచ్చి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా జగన్ నియమించారని, కొలిగ్స్ ఎవ్వరయినా లేట్‌గా వస్తే వారికి రూ. 25వేల్సు ÷న్ వేసేవారని అన్నారు. గతంలో గ్రాడ్యూఏట్ ఎమ్మెల్సి ఎన్నికలు అవుతుంటే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో దసపల్లా హోటల్‌లో మీటింగ్ పెట్టారని అన్నారు. దీనిపై కూడా విచారణ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చక కూడా ఇలాంటి క్రిమినల్స్ విషయంలో ఉదాసీనంగా ఉండడం తగదని అన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఆంధ్రా యూనివర్సిటీని ప్రసాద్ రెడ్డి వైసీపీ కార్యాలయంగా మార్చాడని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో డబ్బు సంచులు మొదలుకొని అన్ని ఏయూలోనే జరిగాయన్నారు. యూజిసి రూసా నిధులు డిపిఆర్ ప్రకారం కాకుండా కోట్లది రూపాయయలు ఇష్టాను సారం నిధులు డైవర్ట్ చేశారని ఆరోపించారు. ఉద్యోగాల నుండి తొలగింపబడ్డ వ్యక్తిని బ్యూటిఫికేషన్ డీన్‌గా పెట్టి 80 లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారని, యూనివర్సిటీలోని భారీ వృక్షాలను జగన్ హెలిప్యాడ్‌ల కోసం కొట్టేశారని వీటన్నింటిపై విచారణ జరపాలని ఆయన అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో పరిశోధనలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసి విద్యార్థులను ఇబ్బందులు పెట్టారని,పేద విద్యార్థులకు యూనివర్సిటీని దూరం చేశారని, ఇంకా ప్రసాద్ రెడ్డి గురించి చెప్పాలంటే ఒక రోజు కూడా సరిపోదని.. ఆయనపై విచారణకు టైంబౌండ్ పెట్టి చర్యలు తీసుకోవాలి రామకృష్ణ బాబు డిమాండ్ చేశారు.ఆంధ్రాయూనివిర్సిటీ అనగానే సర్వేపల్లి రాధాకృష్ణన్, సివిరామన్, సరోజిని నాయుడు, నీలం సంజీవరెడ్డిలు గుర్తుకు వస్తారని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. నియామకం జరిగాక స్వామి భక్తితో విగ్రహం పెట్టారని, కార్పోరేషన్ ఎన్నికల్లో అభ్యర్థులకు బీఫాంలు ఏయూలో ఇచ్చారని, ఇలాంటివి మళ్లీ ఏ యూనివర్సిటీలో రాజకీయ కార్యకలాపాలు లేకుండా ఉండేలా కఠిన చర్యలు ఉండాలని అన్నారు. అన్ని ఆరోపణలపై విజిలెన్స్ విచారణ చేసి కాలపరిమితితో చర్యలు తీసుకోవాలన్నారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే జగన్‌కు పట్టిన గతే

# కనీసం ప్రతిపక్షహోదా కూడా దక్కలేదు

పిఠాపురం,పిఠాపురం ప్రజలు, జన సైనికులకు రుణపడి ఉన్నామని జనసేన ముఖ్యనేత, ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబు అన్నారు. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం సమీపంలోని చిత్రాడలో ఏర్పాటు చేసిన 'జయ కేతనం' సభలోనాగబాబు మాట్లాడుతూ.... 'నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఏం జరుగుతుందో చూశాం. నోటిదురుసు ఉన్న నేతకు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. రాజకీయాల్లో జాగ్రత్తగా మాట్లాడాలని పవన్ చెప్పారు. జగన్ లాంటి హాస్యనటులు ఎన్నో కలలు కన్నారు. మరో 20 ఏళ్ల వరకు జగన్ కలలు కంటూనే ఉండాలని నా సలహా అంటూ చలోక్తులు విసిరారు. జనసేన నేతలు, కార్యకర్తలు, వీర మహిళలకు జనసేన 12వ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు.అధికారం వచ్చింది కదా అని నేతలెవరూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని సలహా ఇచ్చారు. పవన్ కల్యాణ్ క్రమశిక్షణ కలిగిన నేత. 12 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఆయన ఎదుర్కొన్నారు. పిఠాపురంలో ఘన విజయం సాధిస్తామని పవన్‌కు ముందే తెలుసు. రాబోయే 20 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణయుగం చూడబోతోంది. పదవులు వచ్చినా, రాకపోయినా ఆయనకు సేవలు చేస్తాం. ప్రజలు బాగోగులు చూసే వ్యక్తి పవన్. అడగకుండానే వరాలు ఇచ్చేది వ్యక్తి పవన్. జనసేనకు ప్రాణవాయువు కార్యకర్తలు, వీర మహిళలు. పవన్‌లా గొప్ప వ్యక్తి కావాలి.. లేకుంటే ఆయనకు అనుచరుడిగా ఉండాలని' చెప్పారు.ప్రజల బాగోగులు చూసే వ్యక్తి పవన్ కల్యాణ్. అలాంటి ఒక గొప్ప వ్యక్తిగా కావాలి.. లేకుంటే ఆయనకు అనుచరుడిగా ఉండాలి. వచ్చే రెండు, మూడు తరాల గురించి ఆలోచించే వ్యక్తి పవన్. దేవుడు అడిగితేనే వరాలిస్తాడు.. కానీ, ఆయన అడగకుండానే వరాలిస్తారు.

# కాంగ్రెస్ పెద్దలకు షాక్ ఇచ్చేలా రాహుల్ లో మార్పు



హైదరాబాద్,కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీలో గణనీయమైన మార్పు వస్తోంది అని అంటున్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ లో క్షీణత మొదలు కావడంతో పార్టీ ఇబ్బందులో ఉండడంతో రాహుల్ గాంధీ పూర్తి స్థాయిలో పార్టీ ప్రక్షాళనకు ఉపక్రమించారు అని అంటున్నారు.కాంగ్రెస్ పార్టీ ఈ రోజున చాలా రాష్ట్రాలో మూడవ స్థానంలో ఉంది. కాంగ్రెస్ చేతిలో కేవలం మూడు రాష్ట్రాలే సొంతంగా అధికారం చలాయించేలా ఉన్నాయి. దాంతో కాంగ్రెస్ లో నే అంతర్మధనం మొదలైంది. ఇలాగే వదిలేస్తే పార్టీ ఇబ్బందులో పడుతుంది అని అంతా అంటున్నారు.ఈ క్రమంలో సీనియర్ నేతలతో వన్ టూ వన్ భేటీకి రాహుల్ గాంధీ ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ కోసం ఏళ్ళ తరబడి వెయిట్ చేసిన వారిని సైతం ఆయనే పిలిచి మరీ గంటల తరబడి చర్చిస్తున్నారు.అలా కాంగ్రెస్ లో మేధావిగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి శశిధరూర్ తో రాహుల్ సమావేశం కావడం విశేషం. ఆయన మూడేళ్ళుగా రాహుల్ గాంధీతో అపాయింట్మెంట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఆయనే ఆశ్చర్యపోయేలా రాహుల్ గాంధీతో గంటల పాటు భేటీ జరిగింది.ఈ సందర్భంగా శశిధరూర్ తన అభిప్రాయాలను కచ్చితంగా రాహుల్ గాంధీతో పంచుకున్నారని అంటున్నారు. నిజానికి శశిధరూర్ ని పార్లమెంట్ లో కూడా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా ఇంతకాలం సైడ్ చేసారు. ఇపుడు నష్ట నివారణ చర్యలలో భాగంగా రాహుల్ ఆయనకు ప్రాధాన్యత ఇస్తున్నారు.మరో వైపు చూస్తే మొదటి నుంచి కాంగ్రెస్ కుటుంబంలో ఉంటూ వస్తున్న రాజీవ్ శుక్లా మోహన్ ప్రకాష్ అజోయ్ కుమార్ వంటి అనుభవం కలిగిన నాయకులతో పాటు గుజరాత్ మాజీ సీఎం మాధవ్ సింగ్ సోలంకి కుమారుడు భరత్ సోలంకి వంటి కీలక నేతలతో వరుసగా రాహుల్ గాంధీ భేటీలు వేస్తున్నారు.పార్టీ పునర్ నిర్మాణం మీదనే వీరితో ఆయన చర్చిస్తున్నారని అంటున్నారు. ఈ భేటీల మీద సీనియర్లు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాహుల్ గాంధీకి ఇప్పటికీ ఎంతో తేడా ఉందని వారు అంటున్నారు. రాహుల్ గతంలో తాము ఇచ్చిన ఏ ప్రజంటేషన్ మీద అయినా ఎక్కువగా ఆసక్తి చూపించే వారు కాదని ఇపుడు మాత్రం ఆయన ప్రతీ విషయం అడిగి మరీ తెలుసుకోవడం శుభ పరిణామంగా చెబుతున్నారు.ఇక చూస్తే కనుక అంకిత భావంతో పనిచేసేవారికే పదవులు ఇస్తూ రాహుల్ పార్టీలో కొత్త జోష్ తెస్తున్నారు. తెలంగాణాకు మీనాక్షీ నటరాజ్, బీహార్ కి క్రిష్ణ అలవూరు వంటి నాయకులని నియమించడం అందులో భాగమే అని అంటున్నారు. బీహార్ లో పార్టీని పటిష్టం చేసి ఈ ఏడాది చివరిలో జరిగే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా చేయడానికే క్రిష్ణ అలవూరు ని నియమించారు.ఇక మీనాక్షి నటరాజన్ నియామకం కూడా తెలంగాణాలో కాంగ్రెస్ మరింత జోరు చేయడానికే అని అంటున్నారు. ఈ ఏడాది జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది జరిగే అసోం కేరళ రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ అవకాశాలు పెంచడానికే రాహుల్ ఈ మేధోమధనం నిర్వహిస్తున్నారు అని అంటున్నారు.ఇంకో వైపు చూస్తే రాష్ట్రాలలో కాంగ్రెస్ తాను గెలవకపోయినా ఇతర పార్టీలని ఓడించడానికి గెలిపించడానికి సరిపడా ఓట్లు తెచ్చుకుంటోంది. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీకి 45 శాతం పైగా ఓట్లు వస్తే ఆప్ కి 43 శాతంగా వచ్చాయి. కాంగ్రెస్ కి ఆరు శాతం ఓట్లు వచ్చాయి. దాంతో ఆప్ కాంగ్రెస్ పొత్తు ఉంటే మూడవ సారి కేజ్రీవాల్ సీఎం అయ్యేవారు అని గుర్తు చేస్తున్నారు.అలా రాష్ట్రాలలో తమ బలాన్ని చూపించి సీట్ల బేరాలను గట్టిగా చేసుకుని అక్కడ బలపడాలని కాంగ్రెస్ చూస్తోంది. ఇక ఎంపీ ఎన్నికల్లో ఎటూ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని చాటుకోవడం ద్వారా కేంద్రంలో అధికారం కోసం బాటలు వేస్తుందని అంటున్నారు. మొత్తానికి రాహుల్ గాంధీ 2029 ఎన్నికల మీద ఇప్పటి నుంచే ఫోకస్ పెట్టారు. కాంగ్రెస్ ని ఈసారి ఎలాగైనా అధికారంలోకి తేవాలని పట్టు బడుతున్నారు. సో కాంగ్రెస్ కి మంచి రోజులు వచ్చినట్లే అంటున్నారు.

# హైదరాబాద్ నుంచి పిఠాపురం వరకు



హైదరాబాద్,జనసేన ఆవిర్భావ దినోత్సవం భారీగా జరిగింది. ఎవరు ప్రసంగాలు ఎలా వున్నా, జనసేన అధిపతి పవన్ కళ్యాణ్ ప్రసంగం ఎలా వుంటుది అంతా ఆశగా, ఆతృతగా ఎదురు చూసారు. ఎందుకంటే జనసేన పార్టీ కూటమి భాగస్వామిగా అధికారంలో వుంది. పదేళ్ల పాటు కూటమి ప్రభుత్వం వుండాలని, చంద్రబాబు సిఎమ్ గా వుండాలని పవన్ పదే పదే చెబుతూ వచ్చారు. మరి ఆవిర్భావ సభలో ఏం చెబుతారు.ఏం మాట్లాడతారు అని అంతా ఎదురు చూసారు. పార్టీ పరంగా విధాన నిర్ణయాలు ఏమైనా తీసుకుంటారా? ప్రకటిస్తారా? పాత నిర్ణయాలను మరింత బలంగా మరోసారి చెబుతారా? అని అంతా ఎదురుచూసారు.కానీ పవన్ ఉపన్యాసం ఆ దిశగా సాగలేదు. కవితా పంక్తులు, ప్రముఖుల సూక్తులు వల్లె వేయడం వరకు సరే, అది ఎప్పుడూ అలవాటే. కానీ ప్రసంగం ఓ దిశ, దశ అన్నది లేనట్లు సాగింది. ఏది గుర్తుకు వస్తే అది మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. సాధారణంగా ప్రసంగం చివర్లో ఓట్ ఆఫ్ థాంక్స్ చెబుతారు. పవన్ అది ప్రసంగం స్టార్ట్ చేసిన కొద్ది సేపటికే చెప్పారు. అంతలోనే చంద్రబాబుకు కెజిఎఫ్ లెవెల్ ఎలివేషన్లు ఇచ్చారు. ఆ తరువాత మళ్లీ కాస్సేపు తన బాల్యంలోకి వెళ్లారు. తన సినిమాల ఆరంభం రోజుల్లోకి వెళ్లారు. మరి కాస్సేపు తన బాల్యంలోకి వెళ్లి వచ్చారు.ఇలా ముందుకు వెనక్కు ముందుకు వెళ్తూ, పొలిటికల్ గా పనికి వచ్చే పాయింట్ ఒక్కటి మాట్లాడలేదు. ఆఖరికి త్రిభాష సూత్రం, సనాతన ధర్మం, సెక్యులరిజం ఇలాంటి వాటి మీదకు వచ్చారు. అక్కడ వున్న వేలాది మంది జనాలు, వేదిక మీద పదుల సంఖ్యలో వున్న నాయకులు అలా సైలెంట్ గా వుండి వినడం తప్ప స్పందన లేదు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, త్రిభాష సూత్రం ఇలా ఏదో ఏదో ఏదోదో మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. ఒకదానికి మరో దానికి లింక్ లేదు. సింక్ లేదు.కాస్సేపు ఇస్లాం ను ప్రశంసిస్తారు. కాస్సేపు వాళ్లను చూసి హిందువులు నేర్చుకోవాలి అంటారు. మరి కాస్సేపు హిందువులను వెనకేసుకు వస్తారు. మరి కాస్సేపు ఇంకేదో అంటారు. అంతలోనే దేశం..ఉత్తర..దక్షిణ వేర్పాటు వాదం అంటారు. తమిళులను అక్కడ పార్టీ నిర్ణయాన్ని తప్పు పడతారు. వివేకం లేదంటారు. తమిళనాడులో తాను 14 ఏళ్ల వయస్సులో వివక్ష ఎదుర్కొన్నా అన్నారు.అంతే తప్ప అసలు రాబోయే నాలుగేళ్లు జనసేన పయనం ఎలా వుండబోతోంది. ఎటు వెళ్తుంది. మూడింట ఒకవంతు పదవులు అన్నది ఏమయింది? ఎంత వరకు వచ్చింది? ఇవేమీ మాట్లాడలేదు. అసలు దాదాపు అధికారంలోకి వచ్చిన తరువాత సాధించింది ఏమిటి అన్నది చెప్పనే లేదు.మొత్తం మీద అసలు దశ, దిశ. లేకుండా సాగింది పవన్ ప్రసంగం. 2047 నాటికి కొత్త నాయకులు తయారు కావాలన్నది ఒకటే చెప్పిన ప్రధాన విషయం. అంటే దాదాపు ఇరవై ఏళ్లు వుంది. అప్పటికి ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు. ప్రస్తుతానికి అయితే పవన్ ప్రసంగం మాత్రం కామన్ కార్యకర్తలకు అస్సలు అర్థం అయింది అని చెప్పుకుంటే అది ఆత్మ వంచనే అవుతుంది.

# డీలిమిటైజేషన్ కలిపింది ఇద్దరినీ..!



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉప్పు, నిప్పు వంటి వారు. విమర్శల స్థాయిని వారిరువురూ దూషణల స్థాయికి దిగజార్చేశారు. నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలతో ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుకుంటూ ఉంటారు. సవాళ్లు, ప్రతి సవాళ్లతో సై అంటే సై అని తలపడుతుంటారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నారు. ఇప్పుడు రేవంత్ ముఖ్యమంత్రిగా ఉంటే.. కేసీఆర్ విపక్షంలో ఉన్నారు. వీరిద్దరూ ఒకే మాట మాట్లాడటం అన్నది.. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఏ విషయంలోనైనా ఏకాభిప్రాయం వ్యక్తం చేయడం అన్నది ఇప్పటి వరకూ జరగలేదు. అసలలాటిం సందర్భం ఒకటి వస్తుందన్న ఊహ కూడా రాజకీయవర్గాలలోనే కాదు, సామాన్య జనంలో కూడా రాలేదు. రేవంత్, కేసీఆర్ మధ్య మాటలయుద్ధం జరగని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. రాజకీయ మర్యాదలకు కూడా తిలోదకాలిచ్చి వారు ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకుంటుంటారు. అయితే అనూహ్యంగా ఆ ఇరువురి నోటీ ఒకే మాట వచ్చింది. ఏదో సినిమాలో నువ్వాదరిని.. నేనీ దరిని కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ అన్న పాటను స్ఫురింపచేసేలే.. నిప్పూ ఉప్పులా చెరో వైపూ ఉండే రేవంత్ రెడ్డి, కేసీఆర్ లను నియోజకవర్గాల పునర్విభజన అంశం ఏకతాటిపైకి తెచ్చింది. ఔను డీలిమిటైజేషన్ ను వ్యతిరేకించే విషయంలో ఇరువురి నోటా ఒకే మాట వచ్చింది. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించే విషయంలో ఇరువురి నోటీ ఒకే మాట వినిపిస్తోంది. జనాభా ప్రాతిపదికగా మాత్రమే జరిగే డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నచర్చ జోరుగా సాగుతోంది. ముందుగా ఈ విషయంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నిరసన గళం ఎత్తారు. జనాభా ప్రాతిపదికగా జరిగే డీలిమిషేషన్ తో పెరిగే సీట్లన్నీ ఉత్తరాదిలోనే పెరుగుతాయనీ, దక్షిణాదిలో నామమాత్రంగా సీట్లు పెరగడమో%౫% లేదంటే అసలు సీట్లే పెరగకపోవడమో.. ఇంకా చెప్పాలంటే సీట్ల సంఖ్య తగ్గిపోవడమో జరుగుతుందన్న ఆందోళనను డీఎంకే వ్యక్తం చేసింది. దీనిపై దేశ వ్యాప్తంగా చర్చ జరగడానికి దోహదం చేసింది. అంతే కాకుండా డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీలతో ఈ నెల 22న అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది.చెన్నై వేదికగా జరగనున్న ఈ సమావేశానికి రావాలంటూ ఇప్పటికే తెలంగాణలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ లకు డీఎంకే ఆహ్వానించింది. రేవంత్, కేటీఆర్ ఇద్దరూ కూడా ఈ సమావేశాన్నిస్వాగతించారు. హాజరవ్వడానికి అంగీకరించారు. డీఎంకేతో కాంగ్రెస్ పొత్తులో ఉన్న సంగతి తెలిసిందే. అటువంటిది డీఎంకే సమావేశానికి హాజరౌతామని కేటీఆర్ అంగీకరించడం విశేషమేనని పరిశీలకులు అంటున్నారు. అదీ కాక రేవంత్, కేటీఆర్ లు ఇద్దరూ ఈ సమావేశానికి హాజరు కానుండటం రాజకీయవర్గాలలో ఆసక్తి రేకెత్తించింది. మొత్తం మీద రేవంత్, కేటీఆర్ ల నోట ఏ విషయంలోనైనా సరే ఏకాభిప్రాయం వ్యక్తం కావడం ఇదే మొదటి సారి అని కూడా అంటున్నారు. చెన్నై వేదికగా జరిగే అఖిలపక్ష సమావేశంలో ఇరువురూ ఒకే వేదిక పంచుకుంటే అది రాజకీయంగా ఒక గొప్ప విశేషంగానే చెప్పుకోవలసి ఉంటుంది. చూడాలి మరి.. రేవంత్ కేసీఆర్ లు ఆ సమావేశానికి స్వయంగా హాజరౌతారో తమతమ పార్టీల తరఫున ప్రతినిధులను పంపుతారో.

# కొలిక్కిరాని తెలంగాణ బిజెపి అధ్యక్షపదవి



న్యూఢిల్లీ, తెలంగాణలో కమల దళపతి ఎంపిక మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర పగ్గాలు ఎవరికి అప్పగించాలనే అంశంపై జాతీయ నాయకత్వం తర్జనభర్జన పడుతోంది. తెలంగాణలో బీసీ వాదం బలంగా వినిపిస్తోన్న నేపథ్యంలో అధ్యక్షుడి ఎంపిక సవాల్‌గా మారింది. అయితే బిసినే చేస్తారన్న వాదనా ఉంది. లేకుంటే ఎస్సీని కుర్చీలో కూర్చోబెడతారన్న వాదనా ఉంది. ఈ క్రమంలో ధర్మపురి అర్వింద్ పేరు తాజాగా చర్చల్లో ముందుకు వచ్చినట్లు సమాచారం. ఆయన అయితే బండి సంజయ్ లాగా దూకుడుగా వ్యవహరిస్తారని అంటున్నారు. ఏప్రిల్‌లో జాతీయ అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు. అప్పటిలోగా దేశంలోని సగానికిపైగా రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ అధ్యక్షుడి ఎన్నిక మార్చి నెలాఖరులోపు ఉంటుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు.ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కేంద్రంలో కీలకమైన బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలను మరొకరికి అప్పగించాలని భాజపా నాయకత్వం గతంలోనే నిర్ణయించింది. భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావుల తోపాటు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తదితరుల పేర్లు సైతం వినిపిస్తున్నాయి. మురళీధర్‌రావు పేరు కూడా తెరపైకి రావచ్చని కొందరు నేతలు చెబుతున్నారు.భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల అధికారిగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేను పార్టీ జాతీయ నాయకత్వం ఇప్పటికే నియమించింది. తెలంగాణ భాజపా పగ్గాలను పార్టీలో ముందు నుంచి ఉన్నవారికే ఇస్తారా? ఇతర పార్టీల నుంచి వచ్చి ముఖ్యనేతలుగా ఉన్న వారికి అవకాశం ఉంటుందా? అన్నది తేలాల్సి ఉంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను భాజపా కైవసం చేసుకోవడం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచింది.

# గ్రీన్ కార్డు మీద జేడీ వాన్స్ వ్యాఖ్యల్లో అంత వివాదాస్పదం ఉందా?




వాషింగ్టన్,కొన్నిసార్లు అంతే.. తీసుకునే ప్రతి నిర్ణయాన్ని భూతద్దంలో వేసుకొని చూడటం.. వ్యాఖ్యలు.. వ్యాఖ్యానాలతో విపరీత అర్థాలు తీయటం అలవాటుగా ఉంటుంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజాగా చేసిన వ్యాఖ్యలకు చెప్పే అర్థాల్ని చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. దేశం ఏదైనా.. అందులో నివసించే వారు తప్పుడు పనులకు పాల్పడినా.. రాజ్యానికి వ్యతిరేకంగా వ్యవహరించినా.. వారి విషయంలో కటువుగా వ్యవహరించటం తప్పేంకాదు. అలానే విదేశీయులు ఒక దేశంలో స్థిరపడి.. అక్కడి పౌరసత్వాన్ని సొంతం చేసుకున్న తర్వాత.. ఆ దేశ సమైక్యతను.. సమగ్రతను దెబ్బ తీసేలా వ్యవహరిస్తే.. అతడిపై చర్యలు తీసుకుంటామని చెప్పటంలో తప్పేంటి? అన్నది ప్రశ్న.తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన సంచల ప్రకటన సారాంశం.. దాని వెనుకున్న కారణాల్ని చూస్తే.. మీడియా.. సోషల్ మీడియాల అతి స్పందన తప్పించి.. అందులో అర్థమేమీ లేదన్న భావన వ్యక్తమవుతుంది. అమెరికాలో గ్రీన్ కార్డుదారులు శాశ్వత నివాసులుగా ఉండలేరని చెప్పటం తెలిసిందే. ఒక చానల్ తో మాట్లాడిన సందర్భంలో ఆయన.. ‘గ్రీన్ కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు. ఇది వాక్ స్వేచ్ఛకు సంబంధించిన అంశం కాదు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం. అమెరికా పౌరులుగా ఎవరిని మాలో విలీనం చేసుకోవాలో మేం నిర్ణయిస్తాం. విదేశీ వ్యవహారాల మంత్రి కానీ.. అధ్యక్షుడు కానీ ఎవరైనా ఒక వ్యక్తిని అమెరికాలో ఉండరాదని నిర్ణయిస్తే.. అటువంటి వారికి ఇక్కడ నివసించేందుకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు ఉండదు’ అని తేల్చి చెప్పారు.ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చెప్పారన్నది ముఖ్యం. అమెరికా గ్రీన్ కార్డు (అధికారిక శాశ్వత నివాస హోదా) ఉన్న మహ్మద్ ఖలీల్ అనే కొలంబియా వర్సిటీ విద్యార్థి ఇటీవల స్థానిక విశ్వవిద్యాలయాల్లో పాలస్తీనా అనుకూల.. ఇజ్రాయెల్ వ్యతిరేకంగా నిర్వహించే ఆందోళనల్లో నాయకత్వం వహించాడు. అతడ్ని గత శనివారం అరెస్టు చేశారు. అంతేకాదు.. అతడికి జారీ చేసిన గ్రీన్ కార్డును రద్దు చేసి అతడి స్వదేశమైన సిరియాకు తిరిగి పంపే ప్రయత్నాల్ని షురూ చేసింది ట్రంప్ సర్కారు. ఈ నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలు ఉన్నాయి.వాస్తవం ఇలా ఉన్నప్పుడు.. గ్రీన్ కార్డు పొందిన వారి నెత్తిన ఏదో బాంబు వేసినట్లుగా వాన్స్ వ్యాఖ్యలకు విపరీతార్థాలు తీయటంలో అర్థం లేదనే చెప్పాలి. చాలా అరుదైన సందర్భాల్లో ఈ తరహా నిర్ణయాలు ఉంటాయన్నది మర్చిపోకూడదు. తాజాగా ట్రంప్ సర్కారు తీసుకున్న నిర్ణయంలో అప్రజాస్వామ్య నిర్ణయం ఉంటే ఖండించటంలో తప్పు లేదు. నిజానికి అమెరికా ఆమోదించిన ఇమ్మిగ్రేషన్.. జాతీయతా చట్టం 1952ను చూసినప్పుడు కూడా.. దేశ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా వ్యవహరించే వలసదారులు ఎవరైనా సరే.. వారిని వెనక్కి పంపించే వీలుంది. అదే సమయంలో నేరాలకు పాల్పడినా.. సుదీర్ఘ కాలం దేశంలో నివసించకపోయినా.. వలస నిబంధనల్ని పాటించటంలో ఫెయిల్ అయినా ఈ తరమా చర్యల్ని తీసుకోవచ్చు. అయితే.. ఈ చట్టాన్ని చాలా అరుదైన సందర్భాల్లోనే ప్రయోగిస్తారని న్యాయవరాలు వ్యాఖ్యానిస్తున్నారు. నిజానికి ప్రతి దేశానికి తనకంటూ ఒక విదేశాంగ విదానం ఉంటుంది. దేశ ప్రయోజనాలు ఇందులో ఉంటాయి. అలాంటి వేళ.. దేశ ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించటంలో అర్థం లేదు. అలాంటి వేళలో చర్యల కత్తిని ఝుళిపించటం తప్పేం కాదు. అలా అని.. రాజ్యం తన రాజకీయ అవసరాల కోసం తప్పుడు నిర్ణయాల్ని తీసుకుంటే వేలెత్తి చూపటానికి వెనుకాడాల్సిన అవసరం లేదు. అందుకు భిన్నంగా వ్యవహరించే వారి విషయంలో కఠిన చర్యలు మిగిలిన వారికి హెచ్చరికగా మారుతుందని చెప్పాలి.ఇదిలా ఉండగా.. పాలస్తీనియన్లకు అనుకూలంగా ఆందోళన చేస్తూ క్యాంపస్ భవనాన్ని తమ స్వాధీనంలోకి తీసుకున్న కొందరు విద్యార్థులను తమ వర్సిటీ నుంచి బహిష్కరించినట్లుగా కొలంబియా విశ్వవిద్యాలయం ప్రకటన చేయటం తెలిసిందే. పట్టభద్రులైన కొందరి డిగ్రీలను కూడా రద్దు చేసినట్లుగా పేర్కొంది. గాజాలో యుద్ధాన్నినిరసిస్తూ గతంలో హమిల్టన్ హాల్ ను ఆక్రమించిన వారిపై వర్సిటీ లీగల్ డిపార్టుమెంట్ భారీగా ఆంక్షలు విధించిన వైనాన్ని వర్సిటీ తన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. మొత్తంగా దేశ సమగ్రతను సందేహాల్లో పడేసే చర్యల్ని ఏ దేశం ఊపేక్షించటంలో అర్థం లేదనే చెప్పాలి.

### బిఆర్ఎస్‌కు అధికార మత్తు వీడలేదు

పెద్దపల్లి,ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినప్పటి కీ కూడా ఆపార్టీ లీడర్లకు ఇంకా అహంకారం తగ్గలేదని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వా మి అన్నారు. వారి తీరు చూస్తుంటే ఇంకా అధి కారంలోనే ఉన్నామనే భ్రమలోనే ఉండి ఇష్టా రాజ్యాంగ మాట్లాడుతున్నారని విమర్శించారు. స్పీకర్ పదవిలో ఉన్నవారిని గౌరవించడం మన అందరి బాధ్యతని గుర్తుచేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం గోపాల్ రావు పేట్ లోని శ్రీ మల్లికార్జున స్వామి, దొంగతుర్తిలో వెంకటేశ్వర స్వామి వార్లను ధర్మపురి ఎమ్మెల్యే. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ ’స్పీకర్ పదవిలో ఉన్న వారిని అగౌర వపరిస్తే సస్పెండ్ చేసుడు న్యాయమే. రాష్ట్రరాజకీయాలను నాశనం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకే ప్రజలు ఓడించారు. నిన్నఅసెంబ్లీలో దళితుడైన స్పీకర్ పై మాట్లాడిన తీరు దళితలపై మీ వ్యతిరేకత కనిపించింది. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ ఉంది’ అని తెలిపారు. ’గోపాల్ రావు పేట గ్రామంతోమా కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. మీరు చూపే ప్రేమ మరువలేనిది.

# ఏప్రిల్ 1 నుంచి మహిళలకు ఉచితంగా ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణం



జమ్మూ :జమ్మూ కశ్మీర్‌లోని మహిళలకు ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వ రంగ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అందించనున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు.మహిళలకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు వారి మౌలిక స్వేచ్ఛను పెంచడం దీని లక్ష్యం. మార్చి 8న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో తన ప్రభుత్వ తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఒమర్ అబ్దుల్లా ఈ పథకాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రయాణ ఖర్చు తగ్గడమే కాకుండా, వారి దైనందిన జీవన విధానానికి సౌలభ్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సదుపాయం మహిళల ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, వారికి మరింత స్వేచ్ఛ, అవకాశాలను అందించనుందని ఒమర్ అబ్దుల్లా అన్నారు.ఈ నిర్ణయాన్ని జమ్మూ కశ్మీర్ మహిళలు హర్షిస్తున్నారు. ఉచిత ప్రయాణం ఆర్థికంగా కొంత ఊరట కలిగిస్తుందని పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడంలో నాణ్యత, భద్రతను తప్పకుండా కాపాడాలని మహిళలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే, 2011 జనాభా లెక్కల ప్రకారం, జమ్మూ కశ్మీర్‌లో మహిళల జనాభా 59 లక్షలు. ఇది గడిచిన 14 ఏళ్లలో మరింత పెరిగింది. అంతేకాదు, రాష్ట్రంలో మహిళా సాక్షరత శాతం కూడా పెరుగుతోంది. దీంతో ఉద్యోగాలు, విద్య కోసం మహిళలు ఎక్కువగా ప్రయాణిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.ఈ పథకం అమలుతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ బస్సుల ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు అధికారులు. అయితే,ఈ విషయంపై SRTC జనరల్ మేనేజర్ షౌకత్ అహ్మద్ మాట్లాడుతూ.. ఆదాయ నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలానే, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యాలు కూడా తమ వ్యాపారంపై దీని ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.మొత్తానికి సర్కారీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు ఖచ్చితంగా ప్రయోజనకరమైనదే. అయితే, దీని వల్ల ప్రభుత్వ రవాణా సంస్థలు, ప్రైవేట్ బస్సుల ఆదాయంపై ప్రభావం పడనుంది. ప్రభుత్వం తగిన ప్రణాళికతో ఆదాయ నష్టాన్ని భర్తీ చేస్తుందని సంబంధిత యాజమాన్యాలు భావిస్తున్నాయి. ఈ పథకం మహిళల ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు, వారి భద్రతపై కూడా దృష్టి పెట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రానున్న ఈ ఉచిత ప్రయాణ విధానం ఎలా ప్రభావం చూపుతుందో చూడాలిమరి.

### దళితులను తక్కువచేస్తున్న బిఆర్ఎస్ పార్టీ

హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి దళితులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, అది అందరికి తెలుసునని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ స్పందించారు. గతంలో బీఆర్ఎస్, కెసిఆర్ ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదని ఆయన అన్నారు. ఇప్పుడు తమ స్పీకర్‌ను బీఆర్ఎస్ అవమానించి ందని మండిపడ్డారు. కెటిఆర్‌కు దళితులపై ఉన్న ప్రేమేంటో ప్రజలంతా గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు ప్రభుత్వంలో ఉన్న మీరు స్పీకర్‌కు ఇస్తున్న విలువ ఏంటో తెలుసుకోవాలని పేర్కొన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించి, అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తాననడం సిగ్గు చేటని అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com